




PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ,రంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 05, ఎడిటర్,చెరుకు ఉపేందర్, పేజీలు : 8, వెల రూ. 5, శుక్రవారం - 06 - జూన్ - 2025

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# ఉద్యోగులకు 2 డీఏలు



- తక్షణమే ఒకటి చెల్లింపు.. 6 నెలల తర్వాత రెండో డీఏ
- మళ్లీ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీలు
- ఉద్యోగులకు వైద్య సదుపాయం కోసం ట్రస్ట్
- ప్రతి నెలా రూ. 700 కోట్ల మేర ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపు
- సచివాలయంలో 12.5 శాతం నాన్ సెక్రటేరియట్ సర్వీసెస్ కోటా
- అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనం రూ. 2 లక్షలకు పెంపు
- ఎన్నికల్లో బదిలీ అయిన ఉద్యోగులు తిరిగి సొంత స్థానాలకు బదిలీ
- హామ్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రోడ్ల అభివృద్ధి
- కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో మెట్రో రైలు విస్తరణ
- సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు

**వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, పొంగులేటి**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2 డీఏలు (కరువు భత్యం) చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏలలో ఒక డీఏను తక్షణమే చెల్లించాలని నిర్ణయించింది. నాటి నుంచి ఇప్పటివరకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను 28 వాయిదాల్లో చెల్లించనుంది. ఇక మరో డీఏను 6 నెలల తర్వాత చెల్లించనుంది. వచ్చే ఏప్రిల్‌లో దీనిపై ప్రకటన చేయనుంది. ఉద్యోగులకు 5 పెండింగ్ డీఏలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతానికి రెండు డీఏలపైనే కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం ఈ మేరకు పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన అపరిష్కృత సమస్యలపై విస్తృతంగా చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి నేతృత్వం వహించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు.

### ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘ చర్చ..

ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి కేబినెట్‌కు నివేదించారు. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది. ఉద్యోగుల 57 డిమాండ్లను మిగతా.. 2లో

## బక్రీద్ వేళ కొందరు గోవులను దొంగ చాటుగా
# కబేళాలకు తరలించే అవకాశం ఉంది



అమరావతి: గోవులను సంరక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. గోవులను పవిత్రంగా ఆరాధించే గొప్ప సంస్కృతి మన సమాజంలో ఉందని, అటువంటి గోమాతలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆయన అన్నారు. చట్టాలు కూడా గోవధను ఏమాత్రం అంగీకరించవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేశారు. "గోమాతల సంరక్షణ కోసం ఇప్పటికే ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికార యంత్రాంగానికి ప్రజల నుంచి పూర్తి సహకారం అందాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి" అని తెలిపారు. గో సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ దీన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా బక్రీద్ పండుగ సమీపిస్తున్న తరుణంలో, కొందరు వ్యక్తులు గోవులను అక్రమంగా, దొంగచాటుగా కబేళాలకు తరలించే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టేందుకు అధికారులు ఇప్పటికే పలు జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన మిగతా.. 2లో




**వాళ్ల ఆవేదన పట్టించుకోండి... మంత్రి నారా లోకేశ్ కు షర్మిల విజ్ఞప్తి**

ఏపీలో రేపటి నుంచి మెగా డీఎస్సీ

డీఎస్సీ అభ్యర్థుల ఆవేదనను పట్టించుకోవాలన్న షర్మిల

మంత్రి లోకేశ్ ను ఉద్దేశిస్తూ ట్వీట్




## 34 ఏళ్ల హెరిటేజ్ ప్రస్థానం.. వేడుకలకు హాజరైన మంత్రి నారా లోకేశ్

- హెరిటేజ్ ఫుడ్స్ 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మంత్రి నారా లోకేశ్

# కాళేశ్వరంపై 10న సీఎం సమీక్ష!

బనకచర్ల-గోదావరి అనుసంధానంపై కూడా..




ఉద్యోగుల అంశాలపైనే సుదీర్ఘ చర్చతో.. గురువారం నాటి భేటీలో జరగని సమీక్ష



## మళ్లీ కరోనా కలకలం... 24 గంటల్లో
# 564 కొత్త కేసులు.. ఏడుగురి మృతి

భారత్‌లో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

యాక్టివ్ కేసుల సంఖ్య 4,866కు చేరిక

కేరళలో అత్యధికంగా 1,487 యాక్టివ్ కేసులు

ఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టినట్లు కనిపించిన మహమ్మారి, ఇప్పుడు మళ్లీ విజృంభిస్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది, మరణాలు కూడా మిగతా.. 2లో

## ఉద్యోగుల డిమాండ్లపై
# క్యాబినెట్‌లో చర్చ.

**ఉద్యోగుల సమస్యలపై అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక, డీఏ, ఆరోగ్య భద్రత పెండింగ్ బిల్లుల కార్యాచరణపై చర్చ**

**ప్రస్తుతం ఒక డీఏ, ఆరునెలల తర్వాత మరో డీఏ చెల్లిస్తాం**

**బీమాకు ఉద్యోగులు ప్రతినెలా రూ.500చెల్లిస్తే.. ప్రభుత్వం కూడా కొంత చెల్లిస్తుంది**

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ మంత్రివర్గం ఉద్యోగుల డిమాండ్లపై ప్రధానంగా చర్చించింది. దాదాపు ఐదున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో.. ఉద్యోగుల




సమస్యలపై అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక, డీఏ, ఆరోగ్య భద్రత పెండింగ్ బిల్లుల కార్యాచరణపై చర్చించినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను భట్టి విక్రమార్క, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మిగతా.. 2లో

## పుతిన్ గట్టిగానే చెప్పారన్న ట్రంప్..
# ధ్రువీకరించిన క్రెమ్లిన్




- ఉక్రెయిన్ డ్రోన్ల దాడికి తాము బదులుతీర్చుకుంటాం
- ప్రతీకార దాడులు చేయాలన్న తమ ప్లాన్ గురించి ఫోన్ కాల్‌లో ట్రంప్‌నకు వెల్లడి
- పుతిన్‌తో 75 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడా




## మొక్కలు నాటకపోతే భవిష్యత్‌లో ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి

హైదరాబాద్: మొక్కలను నాటడంలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మంత్రి మొక్కలు నాటారు. కాలుష్య నియంత్రణ చేయకపోవడంతో అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని.. వాటిని సంరక్షించుకోవాలని కోరారు.

# ఛత్తీస్ గఢ్ లో భీకర ఎన్‌కౌంటర్...

- మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతి




- బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్
- మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ హతం
- సుధాకర్ తలపై రూ. కోటి రివార్డు
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో మోస్ట్ వాంటెడ్

## స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు..
# ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

## చెట్టు లేని జీవితాన్ని ఊహించలేం: పవన్ కల్యాణ్

- గత ప్రభుత్వంలో సీఎం హెలికాప్టర్‌లో వస్తున్నా చెట్లు నరికేశారు: చంద్రబాబు
- నేడు ఒక్కరోజే కోటి మొక్కలు నాటుతున్నాం
- ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం
- "రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది




అమరావతి: నేడు ఒక్కరోజే కోటి మొక్కలు నాటుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా



పెట్టుకున్నట్లు వివరించారు. అమరావతి పరిధి అనంతవరం ఏడీసీఎల్ పార్కులో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మంత్రి నారాయణతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడారు. "రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది. అటవీ విస్తీర్ణం పెంచడంలో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలవాలి. గత ప్రభుత్వం చెట్లు నరకడం తప్ప సంరక్షించింది లేదు. అప్పుడు సీఎం హెలికాప్టర్‌లో వస్తుంటే కూడా చెట్లు నరికారు. అలా నరికితే కొన్ని దేశాల్లో జైల్లో పెడతారు. మొక్కలు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది?

స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు.. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్‌గా మారింది. మిగతా.. 2లో

## బెంగళూరు తొక్కిసలాట... కమిషనర్ సహా ఐదుగురు
# పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటు

- చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో 11 మంది మృతి
- బెంగళూరు పోలీస్ కమిషనర్ సహా ఐదుగురు సీనియర్ అధికారుల సస్పెన్షన్



బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనపై తీవ్రంగా స్పందించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బి. దయానంద, డీసీపీ (సెంట్రల్ డివిజన్) హెచ్.టి. శేఖర్‌తో సహా ఐదుగురు సీనియర్ పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. విచారణను క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. విధానసౌధలో గురువారం నిర్వహించిన అత్యవసర మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. "కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (గిరీష్ ఎ.కె.), ఆ జోన్ అసిస్టెంట్ కమిషనర్ మిగతా.. 2లో

# 34 ఏళ్ల హెరిటేజ్ ప్రస్థానం.. వేడుకలకు హాజరైన మంత్రి నారా లోకేశ్

అమరావతి: హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను కొనియాడారు. రైతుల సాధికారత, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తుల అందించడంలో హెరిటేజ్ ఫుడ్స్ పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు. హెరిటేజ్ ఫుడ్స్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనడం తనకు గర్వకారణంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. దార్శనికుడైన చంద్రబాబు నాయుడు స్థాపించిన ఈ సంస్థ, రైతులను శక్తివంతం చేయడంలోనూ, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తుల అందించడంలోనూ కీలక పాత్ర పోషించిందని ఆయన అన్నారు. తాను కూడా ఒక పూర్వ విద్యార్థిలా గర్వంగా భావిస్తున్నానని, పాత మిత్రులు, సహోద్యోగులను కలుసుకోవడం సంతోషాన్నిచ్చిందని లోకేశ్ తెలిపారు. సంస్థను నడిపిస్తున్న బలమైన నాయకత్వం, విలువలను చూసి తాను ఎంతగానో ఉత్తేజితుడనయ్యానని మంత్రి వివరించారు. హెరిటేజ్ బృందం అంకితభావాన్ని అభినందించిన ఆయన, భవిష్యత్తులో కూడా సంస్థ మరింతగా వృద్ధి చెందుతుందని, దేశ ప్రగతికి గణనీయమైన తోడ్పాటు అందిస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు. సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని లోకేశ్ ఆకాంక్షించారు. ఈ జ్ఞాపకాన్ని మరింత ప్రత్యేకంగా మార్చుకునేందుకు, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాను ఒక మొక్కను నాటినట్లు మంత్రి నారా లోకేశ్ తెలియజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానం రైతులకు అండగా నిలుస్తూ, వినియోగదారుల మన్ననలు పొందుతూ విజయవంతంగా కొనసాగుతోందని ఆయన ప్రశంసించారు. సంస్థ ఉద్యోగులు, యాజమాన్యానికి లోకేశ్ తన శుభాకాంక్షలు తెలియజేశారు.

### నారా లోకేశ్ గారికి కృతజ్ఞతలు: నారా బ్రాహ్మణి

ఈ కార్యక్రమంలో నారా లోకేశ్ అర్ధాంగి నారా బ్రాహ్మణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగించారు. "హెరిటేజ్ ఫుడ్స్ 34 వసంతాల సుదీర్ఘ ప్రస్థానాన్ని మేము వేడుకగా జరుపుకుంటున్న ఈ ప్రత్యేక సందర్భంలో, మా సంస్థ సాధించిన విజయాలు, మా ప్రయాణం నాకెంతో గర్వకారణంగా ఉంది. రైతులను ఆర్థికంగా శక్తివంతం చేస్తూ, దేశ ప్రజలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలనే ఒక గొప్ప సంకల్పంతో మా మామగారు, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఈ సంస్థకు బీజం వేశారు. అటువంటి గొప్ప వారసత్వంలో నేను కూడా ఒక భాగమైనందుకు ఎంతో సంతోషిస్తున్నాను. 1992లో ఆయన దార్శనికతతో, ఒక చిన్న ప్రయత్నంగా మొదలైన హెరిటేజ్ ఫుడ్స్, ఈ రోజు దేశవ్యాప్తంగా ఇంతటి మహోన్నత స్థాయికి చేరుకోవడం వెనుక ఆయన అకుంఠిత దీక్ష, మా అందరి సమిష్టి కృషి ఉన్నాయి. కేవలం వ్యాపార విస్తరణే కాకుండా, అన్నదాతల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చే ఒక వేదికగా, కోట్లాది ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే ఒక విశ్వసనీయమైన సంస్థగా హెరిటేజ్ రూపుదిద్దుకుంది. మా మామగారు చూపిన మార్గం, ఆయన ఆశయాలు ఎప్పటికీ మాకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ప్రస్తుతం, హెరిటేజ్ ఫుడ్స్ దేశంలోని 13 రాష్ట్రాలలో తన కార్యకలాపాలను విజయవంతంగా కొనసాగిస్తోంది. మూడు లక్షలకు పైగా రైతు సోదరులతో మాకున్న అనుబంధం మా సంస్థకు వెలకట్టలేని ఆస్తి. వారి నిరంతర సహకారంతోనే, కోటి మందికి పైగా వినియోగదారుల ఆదరాభిమానాలను మేము పొందగలుగుతున్నాం. హెరిటేజ్ అంటేనే నమ్మకం, నాణ్యత, ఒక ఉన్నతమైన సామాజిక లక్ష్యం అనే బలమైన భావనను ప్రతి వినియోగదారుడి మదిలో నిలబెట్టగలిగాం. ఈ అద్భుత ప్రయాణంలో మేము మరో కీలకమైన ఆర్థిక మైలురాయిని కూడా అధిగమించాం. 2025 ఆర్థిక సంవత్సరంలో మా సంస్థ వార్షిక ఆదాయం రూ.4,000 కోట్లు దాటింది. ఇది మా 3,300 మందికి పైగా ఉన్న ఉద్యోగుల అంకితభావం, నిబద్ధత, సమిష్టి కృషి వల్లే సాధ్యపడింది. ఈ విజయం మా ఉద్యోగులందరిది. ఈ విజయవంతమైన ప్రయాణంలో నేను కూడా ఒక భాగస్వామిని అయినందుకు వ్యక్తిగతంగా ఎంతో గర్వపడుతున్నాను. ఈ రోజు మా వార్షికోత్సవ వేడుకల్లో నారా లోకేశ్ గారు పాల్గొని, మా సంస్థ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులను స్వయంగా సత్కరించడం మాకు రెట్టింపు ఆనందాన్నిచ్చింది. ఆయన పలికిన ప్రోత్సాహకరమైన మాటలు, చూపిన ఆత్మీయత మా హెరిటేజ్ కుటుంబ సభ్యులందరికీ, వ్యక్తిగతంగా నాకు ఎంతో అమూల్యమైనవి. ఈ సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానం భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో, రెట్టించిన ఉత్సాహంతో కొనసాగుతుందని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. రాబోయే రోజుల్లో మరింత మంది రైతుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తామని, దేశ ప్రజలకు మరింత నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందిస్తామని హామీ ఇస్తున్నాను. ఈ గొప్ప సంస్థలో భాగమైనందుకు సంతోషిస్తూ, మా ఈ ప్రయాణానికి తోడుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అంటూ వివరించారు.

## ఛత్తీస్ గఢ్ లో భీకర ఎన్‌కౌంటర్...

ఛత్తీస్ గఢ్ : మావోయిస్టు పార్టీకి మరో తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్రశ్రేణి నాయకుల్లో ఒకరైన, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ సుధాకర్, భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు హతమైన నెల రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి టైగర్ రిజర్వ్ ప్రాంతంలో మావోయిస్టు సీనియర్ నాయకులు సమావేశమయ్యారన్న కచ్చితమైన సమాచారంతో భద్రతా దళాలు రంగంలోకి దిగాయి. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) దళాలు సంయుక్తంగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో, గురువారం తెల్లవారుజామున మావోయిస్టులకు, భద్రతా దళాలకు మధ్య భీకరమైన కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో సుధాకర్ మరణించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సుధాకర్... మావోయిస్టు వర్గాల్లో గౌతమ్, ఆనంద్, చంటి బాలకృష్ణ, రామరాజు, సోమన్న వంటి అనేక మారుపేర్లతో సుపరిచితుడు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు గ్రామం. గత నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో చురుగ్గా పనిచేస్తున్న సుధాకర్‌పై ప్రభుత్వం రూ. కోటి రివార్డు ప్రకటించింది. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో కూడా ఆయన పాల్గొన్నారు. బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్‌కౌంటర్ ఘటనను ధ్రువీకరించారు. అయితే, సుధాకర్ మృతికి సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం బీజాపూర్ అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గత ఆరు నెలల కాలంలో మావోయిస్టు కేంద్ర కమిటీకి చెందిన ముగ్గురు కీలక నాయకులను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేయడం, మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బగా పరిగణిస్తున్నారు. మూడు వారాల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద ఎదురుదెబ్బ.

ఇదే ప్రాంతంలో మరికొందరు మావోయిస్టు అగ్రనేతలు!

ఇదే ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇన్‌ఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ సీనియర్ లీడర్ పాపారావు కూడా ఉన్నట్లు తమకు సమాచారం అందిందని బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశ్... మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్‌లోని కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్నాడని, ఆయనపై రూ.25 లక్షల రివార్డు ఉందని పేర్కొన్నారు. ఇక పాపారావు గెరిల్లా యుద్ధతంత్రంలో నిపుణుడని, ఐఈడీ దాడులతో సహా అనేక హింసాత్మక ఘటనల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడని, అతడిపై రూ.20 లక్షల రివార్డు ఉందని తెలిపారు. అయితే, వీరిద్దరి ఆచూకీకి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. భద్రతా దళాలు ఆ ప్రాంతంలో తమ గాలింపును ముమ్మరం చేశాయి.

## మళ్లీ కరోనా కలకలం... 24 గంటల్లో
## 564 కొత్త కేసులు.. ఏడుగురి మృతి

మొదటి పేజి తరువాయి



మరణాలు కూడా నమోదవుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం... నిన్నటి వరకు 4,302గా ఉన్న యాక్టివ్ కేసుల సంఖ్య, ఈరోజు 4,866కు చేరింది. కేవలం 24 గంటల వ్యవధిలో 564 కొత్త కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇదే సమయంలో గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా ఏడుగురు కోవిడ్ కారణంగా మరణించారు. మృతుల్లో ఢిల్లీకి చెందిన ఐదు నెలల చిన్నారి కూడా ఉండటం తీవ్ర విచారకరం. ఆ చిన్నారికి ముందే శ్వాసకోశ సమస్యలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఆరుగురు మృతులు వృద్ధులు కాగా, వీరు మధుమేహం, అధిక రక్తపోటు, న్యూమోనియా వంటి ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని సమాచారం. మహారాష్ట్రలో ముగ్గురు, ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో చెరో ఇద్దరు చనిపోయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 1,487 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ (562), పశ్చిమ బెంగాల్ (538), మహారాష్ట్ర (526), గుజరాత్ (508) రాష్ట్రాలు నిలిచాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఒక్కరోజే 105 కొత్త కేసులు వెలుగుచూడటం గమనార్హం. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు మొత్తం 44 కోవిడ్ సంబంధిత మరణాలు నమోదయ్యాయని, వీరిలో ఎక్కువ మంది ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారేనని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో చాలా వరకు స్వల్ప లక్షణాలతో ఉన్నాయని, బాధితులు హోమ్ కేర్‌లోనే కోలుకుంటున్నారని ఆరోగ్య అధికారులు చెబుతున్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అలాగే దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు రద్దీ ప్రదేశాలకు వెళ్లవద్దని సూచించారు. శ్వాసకోశ సంబంధిత లక్షణాలు కనిపిస్తే, పరిస్థితిని గమనిస్తూ, లక్షణాలు తీవ్రమైతే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని కోరారు. తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి అధికారిక సమాచార వనరులపైనే ఆధారపడాలని అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బక్రీద్ వేళ కొందరు గోవులను దొంగ చాటుగా
## కబేళాలకు తరలించే అవకాశం ఉంది

మొదటి పేజి తరువాయి



వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన వెల్లడించారు. ఈ చర్యలకు ప్రజలందరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గోవుల అక్రమ రవాణా లేదా వధకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.

# ఉద్యోగులకు 2 డీఏలు

మొదటి పేజి తరువాయి

ఉద్యోగుల 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించి మిగిలిన వాటిని పరిశీలనకు స్వీకరించింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని నిర్ణయించింది. ప్రతి నెలా రూ. 700 కోట్లకు తగ్గకుండా బిల్లులు చెల్లించనుంది. ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించి మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి ఉద్యోగి నుంచి నెలకు రూ. 500 వసూలు చేయడంతోపాటు సమాన మొత్తాన్ని ప్రభుత్వ వాటాగా ట్రస్ట్‌కు చెల్లించనుంది. ట్రస్ట్ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యవహరించనుండగా ఇతర అధికారులు, ఉద్యోగుల ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ట్రస్ట్ ద్వారా వైద్య సదుపాయం కల్పించనున్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ఏటా సెప్టెంబర్‌లో శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సమావేశం నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇక జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెడికల్ ఇన్వ్యాలిడేషన్ కమిటీ ఏర్పాటు చేయాలన్న మరో కీలక డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను గుర్తించేందుకు ఒప్పుకుంది. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం తీసుకుంది. సచివాలయంలో ప్రస్తుతం పూర్తిగా సెక్రటరియేట్ సర్వీసెస్ ఉద్యోగులే పనిచేస్తుండగా ఇకపై 12.5 శాతం నాన్ సెక్రటరియేట్ సర్వీసెస్ కోటాను అమలు చేయాలనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. పదవీవిరమణ పొందిన ఉద్యోగులను మళ్లీ నియమించరాదనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. గ్రామ కార్యదర్శి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను సొంత జిల్లాలకు తిరిగి పంపించేందుకు అంగీకరించింది. జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల పూర్తితోపాటు నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు డిమాండ్లకు సైతం సమ్మతి తెలిపింది. అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనాలను రూ. 2 లక్షలకు పెంచింది. ఉద్యోగుల అద్దె వాహనాల పెండింగ్ బిల్లుల చెల్లింపుతోపాటు వాహనాల అద్దెల పెంపునకు ఆమోదం తెలిపింది.

### మరికొన్ని నిర్ణయాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించింది. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు రూ. 10 లక్షల ప్రమాద బీమా పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమల్లోకి తెచ్చింది. బీమా కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియం భారం కాకుండా ప్రభుత్వమే నేరుగా బాధితులకు రూ. 10 లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు 385 మంది మరణించగా రూ. 38.5 కోట్ల చెల్లింపులకు మంత్రివర్గం ఆమోదించింది. హైబ్రీడ్ యాన్యూటీ మోడ్ (హామ్) కింద రాష్ట్రంలోని అన్ని (పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ) రోడ్లను అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తొలి దశ కింద 7,947 కి.మీ. పంచాయతీరాజ్, 5,190 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్లు కలిపి మొత్తం 13,137 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనుంది. పంచాయతీరాజ్ రోడ్లకు రూ. 16,780 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 16,414 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టనుంది. వచ్చే రెండున్నరేళ్లలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయనుండగా 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకే ప్రభుత్వం అప్పగించనుంది. పార్లమెంట్ స్థానాన్ని ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాలవారీగా ఒక్కో జిల్లాను ఒక్కో ప్యాకేజీగా విభజించి రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రూ. 19,579 కోట్లతో అంచనాలతో హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కారిడార్%-%1లో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ., కారిడార్%-%2లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ., కారిడార్%-%3లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ. కలిపి మొత్తం 86.1 కి.మీ. కారిడార్‌ను నిర్మించనుంది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ ఈ విషయంలో కేంద్రాన్ని ఒప్పించాలని మంత్రి పొంగులేటి కోరారు.

- రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులకు ప్రోత్సాహాన్ని కొనసాగించాలని.. ప్రజలకు మేలు చేసే కార్యాక్రమాలకు గ్రీన్ చానల్‌లో చెల్లింపులు జరపాలని నిర్ణయించింది. - ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 12 ఎకరాల కేటాయింపును మంత్రివర్గం ఆమోదించింది.

## వాళ్ల ఆవేదన పట్టించుకోండి...
## మంత్రి నారా లోకేశ్ కు షర్మిల విజ్ఞప్తి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయమై లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉద్దేశించి ఆమె పలు కీలక సూచనలు చేస్తూ, అభ్యర్థుల పట్ల కనికరం చూపాలని కోరారు. డీఎస్సీ విషయంలో అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని షర్మిల పేర్కొన్నారు. "విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గారూ, రేపటి నుంచి డీఎస్సీ పరీక్షలు నిర్వహించడం సరైన పద్ధతి కాదని లక్షలాది మంది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి పరీక్ష సమయానికి కేవలం 45 రోజులు మాత్రమే గడువు ఇవ్వడం ఎంతవరకు సమంజసం?" అని ఆమె ప్రశ్నించారు. ఇది మెగా డీఎస్సీ కాదని, అభ్యర్థులను మోసం చేసే 'దగా డీఎస్సీ' అని వారు వాపోతున్నారని షర్మిల తెలిపారు. కనీసం 90 రోజుల ప్రిపరేషన్ సమయం ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని, కేవలం 45 రోజుల్లో మొత్తం సిలబస్ చదవడం సాధ్యం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆమె వివరించారు. "మూడున్నర లక్షల మంది డీఎస్సీ అభ్యర్థుల పట్ల ప్రభుత్వం కనికరం చూపాలి. వారు మీకు లేఖల మీద లేఖలు రాస్తున్నా స్పందించకపోవడం, నిరుద్యోగుల మొరను పట్టించుకోకపోవడం కూటమి ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనం" అని షర్మిల విమర్శించారు. డీఎస్సీ వాయిదా వేయాలని కోరడాన్ని రాజకీయ కుట్రగా మంత్రి లోకేశ్ అభివర్ణించడం ఆయన తొందరపాటు నిర్ణయానికి అద్దం పడుతోందని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని చెబుతూ, డీఎస్సీ నిర్వహణలో పరీక్ష రాసే అభ్యర్థుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని షర్మిల కోరారు. "90 పాఠ్య పుస్తకాలను కేవలం 45 రోజుల్లో అభ్యర్థులు ఎలా చదవగలరో ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ప్రిపరేషన్ గడువును మరో 45 రోజులు పెంచే అంశంపై తక్షణమే పరిశీలన చేయాలి" అని ఆమె డిమాండ్ చేశారు. అంతేకాకుండా, నార్మలైజేషన్ పద్ధతిలో కాకుండా డీఎస్సీ పరీక్షలను ఒకే జిల్లా, ఒకే పేపర్ విధానంలో నిర్వహిస్తే బాగుంటుందన్న అభ్యర్థుల వాదనపై కూడా ప్రభుత్వం పునరాలోచన చేయాలని షర్మిల కోరారు.

## మంత్రివర్గంలో మాదిగలకూ అవకాశం కల్పించండి

న్యూఢిల్లీ, : మంత్రివర్గ విస్తరణలో మాదిగలకూ అవకాశం కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌ను ఆ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మందుల సామేల్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలే యాదయ్య కోరారు. గురువారం ఢిల్లీలో వారిని కలిసిన అనంతరం.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. 'మంత్రివర్గంలో నిజమైన మాదిగలకు అవకాశం కల్పించాలి. మంత్రివర్గంలో ఉన్న కొందరు మాదిగలమని చెప్పుకొంటున్నారు.. కానీ తెలంగాణ మంత్రివర్గంలో మాదిగలెవరూ లేరు. ఇది మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేల అంశం కాదు. ఇది యావత్ తెలంగాణ మాదిగల ఆత్మగౌరవానికి చెందిన అంశం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యవసర సమావేశం ఉండడంతో కలవలేకపోయాం. ఈ విషయమై ఆయనకూ లేఖ రాశాం' అని వెల్లడించారు.

## ఉద్యోగుల డిమాండ్లపై
# క్యాబినెట్‌లో చర్చ.

మొదటి పేజి తరువాయి

మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను భట్టి విక్రమార్క, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.

క్యాబినెట్ నిర్ణయాలివే..

ఉద్యోగులకు రెండు డీఏలు చెల్లించాలని క్యాబినెట్ నిర్ణయించించి. ప్రస్తుతం ఒక డీఏ, ఆరునెలల తర్వాత మరో డీఏ చెల్లిస్తాం. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ ఉద్యోగులకు మేలు చేసే విధంగా క్యాబినెట్ నిర్ణయాలు ఉద్యోగుల ఆరోగ్య బీమాకు సంబంధించి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. బీమాకు ఉద్యోగులు ప్రతినెలా రూ.500చెల్లిస్తే.. ప్రభుత్వం కూడా కొంత చెల్లిస్తుంది. ఉద్యోగులు, ప్రభుత్వం చెల్లించే డబ్బులను ట్రస్టులో జమ చేస్తాం. ఉద్యోగులకు ఏవైనా ఆరోగ్య ససమస్యలు వస్తే ట్రస్టు ద్వారా డబ్బులు చెల్లిస్తాం. ఉద్యోగులకు సంబంధించిన బిల్లుల పెండింగ్ బకాయిలను నెలకు రూ.700 కోట్లకు తగ్గకుండా చెల్లిస్తాం. పెండింగ్ బకాయిలను నెలల వారీగా క్లియర్ చేస్తాం. గతేడాది 385 మంది మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు మరణించారు. మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు మరణిస్తే రూ.10లక్షలు ఇచ్చేందుకు నిర్ణయం. కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ వర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టేందుకు క్యాబినెట్ నిర్ణయం. హామ్ విధానంలో రోడ్ల ఆధునికీకరణ చేపట్టాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో 5,100 కి.మీ, పంచాయతీరాజ్ పరిధిలో 7,947 కి.మీ రహదారులు ఆధునికీకరణ. రూ.19,575 కోట్లతో సుమారు 86 కి.మీ మెట్రో నిర్మాణానికి క్యాబినెట్ నిర్ణయం

## బెంగళూరు తొక్కిసలాట... కమిషనర్ సహా ఐదుగురు
## పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటు

మొదటి పేజి తరువాయి

"కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (గిరీష్ ఎ.కె.), ఆ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) (బాలకృష్ణ), సెంట్రల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) (హెచ్.టి. శేఖర్), స్టేడియం భద్రతకు బాధ్యత వహించిన అదనపు పోలీస్ కమిషనర్, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ (బి. దయానంద)లను తక్షణమే సస్పెండ్ చేయాలని నిర్ణయించాం" అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఈ విషాద ఘటనకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి, మంత్రులు హెచ్.కె. పాటిల్, ఎం.సి. సుధాకర్, హెచ్.సి. మహదేవప్పలతో పాటు సీఐడీ అధికారులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు సీఎం వివరించారు. "ప్రాథమికంగా ఈ అధికారుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించాయి. అందుకే వారిని సస్పెండ్ చేయాలని నిర్ణయించాం" అని ఆయన స్పష్టం చేశారు. ఆర్సీబీ జట్టు తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన సందర్భంగా జరిగిన సంబరాల్లో ఈ తొక్కిసలాట జరగడం బాధాకరమని, మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తున్నామని సీఎం అన్నారు. ఈ అంశాన్ని గురువారం జరిగిన సాధారణ కేబినెట్ సమావేశంలో తీవ్రంగా చర్చించామని, నిన్నటి దురదృష్టకర ఘటనపై చర్చించిన తర్వాతే ఈ నిర్ణయాలు తీసుకున్నామని సిద్ధరామయ్య తెలిపారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీ, డీఎన్ఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారిని అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సీఎం చెప్పారు. వారిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. "నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఇలాంటి ఘటన జరగలేదు. ఈ ఘటన మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది" అని సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. "నిన్న ఆదేశించినట్లుగా మేజిస్టీరియల్ విచారణ ప్రారంభమైంది. ఈ పెను విషాదంపై కొంత సమాచారం అందిన తర్వాత, కేబినెట్ సమావేశంలో చర్చించాం. మూడు సంస్థలపై (ఆర్సీబీ, డీఎన్ఏ ఈవెంట్స్, కేఎస్‌సీఏ) దర్యాప్తును సీఐడీకి అప్పగించాం" అని ఆయన పునరుద్ఘాటించారు.

## పుతిన్ గట్టిగానే చెప్పారన్న ట్రంప్.. ధ్రువీకరించిన క్రెమ్లిన్

ఇంటర్నెట్‌డెస్క్: ఉక్రెయిన్ డ్రోన్ల దాడికి తాము బదులుతీర్చుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ తనతో చాలా గట్టిగా చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ధ్రువీకరించింది. ప్రతీకార దాడులు చేయాలన్న తమ ప్లాన్ గురించి ఫోన్ కాల్‌లో ట్రంప్‌నకు వెల్లడించినట్లు తెలిపింది. పుతిన్‌తో 75 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడానని, సంభాషణ సవ్యంగానే కొనసాగినప్పటికీ ఉక్రెయిన్- రష్యా మధ్య శాంతి సాధనకు అది ఉపకరించదని సామాజిక మాధ్యమంలో ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే క్రెమ్లిన్ స్పందన వచ్చింది. తుర్కియే నగరం ఇస్తాంబుల్ వేదికగా రష్యా, ఉక్రెయిన్ మధ్య మరోసారి శాంతి చర్చలు జరగనున్న వేళ.. 'స్పైడర్ వెబ్' పేరుతో గత ఆదివారం మునుపెన్నడూ లేని రీతిలో ఉక్రెయిన్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఏకంగా రష్యా భూభాగంలోకి కంటెయినర్లలో డ్రోన్లను తరలించి వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేపట్టింది. ఈ ఘటనలో రష్యాకు చెందిన 41 యుద్ధ విమానాలు, పలు ఎయిర్ బేస్‌లు ధ్వంసం అయ్యాయి. రష్యా భూభాగంలోని 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇర్కుట్స్క్ ప్రాంతంలోని వైమానిక స్థావరంలోకి వెళ్లి మరీ డ్రోన్లు దాడులు చేశాయి. ఈ దాడిలో టీయూ-95, టీయూ-22ఎం3 బాంబర్లు, కీలకమైన ఏ-50 ఎయిర్ క్రాఫ్టులు ఈ ఘటనలో ధ్వంసం అయ్యాయి. మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధంలో ఈ ఘటన మాస్కోకు పెద్ద కుదుపు కాగా, ఉక్రెయిన్ దళాలకు మరింత ఆత్మస్థైర్యం లభించినట్టు అంతర్జాతీయ విశ్లేషకులు తెలిపారు.

### ఉక్రెయిన్‌పై డ్రోన్లతో దాడి..

ఈ పరిణామాల వేళ రష్యా గురువారం ఉక్రెయిన్‌లోని ప్రైలుకీ నగరంలో డ్రోన్ల దాడి జరిపింది. అవి నివాస ప్రాంతాన్ని తాకాయని, ఒక ఏడాది బిడ్డ సహా ఐదుగురు మృతిచెందారని అధికారులు వెల్లడించారు. ఆ నగరం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు 100 కి.మీ.దూరంలో ఉంది. అక్కడ ఎలాంటి మిలిటరీ ఆస్తులు లేవు. ఇక ప్రైలుకీతో పాటు మిగిలిన నగరాలను కూడా 103 డ్రోన్లు తాకాయని అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు.

## స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు..
## ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

మొదటి పేజి తరువాయి

గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్‌గా మారింది. దీంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. పద్మశ్రీ వనజీవి రామయ్య నా వద్దకు ఎప్పుడు వచ్చినా.. మొక్క తీసుకుని వచ్చేవారు. ఆయన్ను అందరం స్మరించుకోవాల్సిన అవసరముంది. ఇవాళ 16 రకాల మొక్కలు నాటాం. మూడేళ్ల వరకు మనం మొక్కను కాపాడితే తర్వాత అదే పెరుగుతుంది. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం కూడా పర్యావరణ పరిరక్షణలో కీలకమైంది. స్వర్ణాంధ్ర అంటే కేవలం ఆదాయం పెంచడం మాత్రమే కాదు. ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించుకోవడమూ అందులో భాగమే. నా మనసుకు బాగా దగ్గరగా ఉండే సబ్జెక్ట్ పర్యావరణ పరిరక్షణ. ప్లాస్టిక్ వినియోగం మనుషులకే కాదు.. జంతువులకూ ప్రమాదంగా మారింది. మనం తినే తిండి, పండించే పంటలు ప్లాస్టిక్ మయం అవుతున్నాయి. కొందరు చికెన్ వ్యర్థాలను చేపల పెంపకంలో వాడుతున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలు వేస్తే... అనారోగ్య సమస్యలు వస్తాయి. స్వార్థంతో కాకుండా అందరం భావితరాల కోసం బతకాలి. రాయలసీమలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోంది. చెత్త నుంచి కూడా సంపద సృష్టించే మార్గాలు ఉన్నాయి. వరి వ్యర్థాల నుంచి కూడా బయో ఫ్యూయల్ తయారు చేసే అవకాశం ఉంది. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రయత్నాలను గతంలోనే ప్రారంభించాం. తెదేపా ప్రారంభించిన ప్రయత్నాలను గత వైకాపా ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసింది. " అని చంద్రబాబు అన్నారు.

### చెట్టు లేని జీవితాన్ని ఊహించలేం: పవన్ కల్యాణ్

పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతుగా ఏదైనా సాధించి మాట్లాడతానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. చెట్టు లేని జీవితాన్ని ఊహించలేమని చెప్పారు. ఒకప్పుడు ఇంటి చిరునామాకు చెట్లే ఆనవాళ్లుగా ఉండేవని తెలిపారు. ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సీఎంగా ఉన్నారని పేర్కొన్నారు. 50 శాతం పచ్చదనం లక్ష్యం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు.

## కాళేశ్వరంపై 10న సీఎం సమీక్ష!

హైదరాబాద్, : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎసఏ) ఇచ్చిన నివేదికతోపాటు బ్యారేజీల వైఫల్యానికి కారకులైన వారిపై విజిలెన్స్ చేసిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 10న సమీక్షించే అవకాశాలు ఉన్నాయి. గురువారం నాటి క్యాబినెట్ సమావేశంలోనే ఈ సమీక్ష ఉంటుందని భావించినా.. ఉద్యోగులకు సంబంధించిన అంశాలపైనే సుదీర్ఘంగా చర్చ జరగడంతో వాయిదా పడింది. వాస్తవానికి రెండున్నర నెలల కిందటే కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎసఏ నివేదిక ఇచ్చింది. దాని ప్రకారం బ్యారేజీలపై కార్యాచరణ ప్రణాళికలు అందించాలని ప్రభుత్వం నిర్మాణ సంస్థలను కోరింది. కానీ మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ధిక్కారస్వరం వినిపించడంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సీఎం సమీక్ష కీలకంగా మారింది. ఇక కీలకమైన గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు అంశంపై కూడా సీఎం 10వ తేదీన సమీక్షించనున్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి: సురేఖ

హైదరాబాద్, : ప్రపంచానికి సవాలుగా మారిన ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రభుత్వం, ప్రజలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా అంతం చేయడం' అనే థీమ్‌తో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు.

# పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

## ఐ మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి




అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు: చెట్లను నరకకుండా పచ్చదనాన్ని కాపాడినప్పుడే పర్యావరణ పరిరక్షణకు సాధ్యపడుతుందని మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల చెరువు ఆవరణంలో కమిషనర్ రవీందర్ రెడ్డి సారథ్యంలో అధికారులు, సిబ్బంది 500 మొక్కలను గురువారం నాటారు. అనంతరం చెరువులోనే ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి నీటిని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కిరణ్ కుమార్, డి ఈ ఈ సుమంత్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.




అబ్దుల్లాపూర్మెట్ మండలం పోలీస్ ఇన్స్పెక్టర్గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ రెడ్డిని బి ఆర్ ఎస్ వై ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కార్యదర్శి, మాజీ వార్డు సభ్యులు మొగుళ్ల జీవన్ కుమార్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండల్ గౌడ్, అరుణ్, ప్రవీణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

- అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు

# బేతవోలు గ్రామం లో భూభారతి రెవెన్యూ సదస్సు




చిలుకూరు ( ప్రభాత సూర్యుడు) : రైతులు తమ భూమి సమస్యలను భూభారతిలో దరఖాస్తు చేసుకుంటే సమస్యలను తక్షణమే పరిష్కారం చేస్తామని కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని బేతావోలు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్స లను సద్వినియోగం చేసుకొని తమ భూమి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ధ్రువ కుమార్, ఆర్ ఐ లు మంత్రి ప్రగడ సీతారామచంద్రరావు, శ్వేత, కార్యదర్శులు సత్యనారాయణ వెలిశాల శౌరిక, పూల శ్రీనివాసరావు, ఏ ఎస్ ఓ అశోక్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

రామసముద్రం, జూన్ 5,: రామసముద్రం మండలంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎంపిడిఓ భానుప్రసాద్, టిడిపి పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలు, గ్రామసచివాలయాలు, డంపింగ్ యార్డ్ పరిసరాలలో మొక్కలు నాటారు. ఎంపిడిఓ భానుప్రసాద్,విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బావితరాలకు కాలుష్యం లేని పర్యావరణాన్ని అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. మాలేనత్తం గ్రామ పంచాయతీలోని సచివాలయం, పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది టిడిపి నాయకులు రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాను ప్రసాద్ ,మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ ,టిడిపి యువనాయకుడు రూపేష్ రెడ్డి,ఏపీఓ మాధవి , నారాయణ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ మునిస్వామినాయక్, మండల అధికారులు, కళాశాల ప్రిన్సిపల్ చిట్టిబాబు, సర్పంచులు,విద్యార్థులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.. ఎమ్మెల్యే సునీల్ కుమార్

(స్వామి) గూడూరు!: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటి,హరితాంధ్రప్రదేశ్ కు తోడ్పడాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలియజేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అశోక్ నగర్ పార్కులో జరిగిన హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. గూడూరు పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతంలో ఉన్న పార్కులో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ పాసిం సునీల్ కుమార్ చేతులమీదుగా మొక్కలను నాటారు.అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటి హరితాంధ్రప్రదేశ్ కు తోడ్పడాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ సారథ్యంలో గూడూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు,తెలుగుదేశం పార్టీ నాయకులు శీలం కిరణ్ కుమార్,పులిమి శ్రీనివాసులు,గుండాల భారతి, రహీం, దాసరి రాంప్రసాద్ యాదవ్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని విశాఖ దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి,ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అన్నారు. బుధవారం అయన కార్యాలయంలో జీవీఎంసీ 38వార్డ్ వైసీపీ ఇంచార్జి, శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ ధర్మకర్త బెహరా వెంకటరత్నం,38వార్డ్ వైసీపీ బూత్ ప్రెసిడెంట్లు,కార్యకర్తలు సీతంరాజు సుధాకర్ సమక్షంలో టీడీపీలో చేరారు.వారికి సీతంరాజు సుధాకర్ తెలుగుదేశం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా సీతంరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం సర్వనాశనమైపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిదిశగా పయనిస్తోందన్నారు.తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు సముచిత గౌరవం లభిస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతుగా అనేకమంది స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు.బెహరా వెంకటరత్నం మాట్లాడుతూ మానవత్వానికి మారుపేరైన దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి సీతంరాజు పనితీరుపై ఆకర్షితురాలై, అయన పిలుపు మేరకు అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యమని నమ్మి పార్టీలో చేరినట్లు తెలిపారు.సీతంరాజు నాయకత్వంలో అంకిత భావంతో పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

## ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్
# ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినం

(స్వామి)గూడూరు :గూడూరు రెండవ పట్టణంలో ఏర్పాటైయున్న కోర్టు ప్రాంగణంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ గూడూరు ఆధ్వర్యంలో డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్ అడిషనల్ డిస్టిక్ జడ్జి కె.వెంకట నాగ పవన్, సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి బివి.సులోచన రాణి చేతుల మీదుగా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి వెంకట నాగ పవన్ మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ జనరల్ సెక్రెటరీ ఎంవి. కృష్ణయ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఏ.కోటేశ్వరరావు, పానెల్ లాయర్ అరవ పార్వతయ్య, మహబూబ్ బాషా, డాక్టర్. ఏ.పీ.జేఅబ్దుల్ కలాం ట్రస్ట్ అధ్యక్షులు తాజుద్దీన్,లోక్ అదాలత్ మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



(జి ఎన్ రావు:కోనసీమ జిల్లా:) పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మేము సైతం అంటూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించే మార్గాలను అన్వేషించి ప్రత్యామ్నాయ మార్గాలను ఆచరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాం తి పురజనులకు పిలుపునిచ్చారు. స్థానిక గడియార స్తంభం సెంటర్ నందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించకపోతే జరిగే పరిణామాలను తెలియచేయడానికి భూ గ్రహం విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి ప్రతి ఏటా ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రకృతి లోనికి అబ్బడి ముబ్బడిగా వచ్చి చేరుతున్న ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్న తరుణంలో "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం" చేయడమనే అంశాన్ని 2025 సంవత్సర ఇతివృత్తంగా తీసుకున్నారన్నారు. కోనసీమ జిల్లాలో 4 లక్షల 25 వేల మొక్కలను పాఠశాలలు, వసతి గృహాలు, కాలువలు, డ్రైన్లు, గట్లపైన రహదారులకిరువైపులా నాటాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించిన్నప్పుడే కోనసీమ జిల్లా హరిత శోభిత జిల్లాగా రూపాంతరం చెందుతుందన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న కాలుష్య సంబంధిత సమస్యలకు మూలం శిలాజబంధనాల వాడకం విపరీతంగా పెరగడమేనని, సౌరశక్తి వాడకంపై దృష్టిసారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికం చేయడం వల్లే ప్రకృతి వైవిధ్యంలో తీవ్రమైన అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని ప్రతి ఒక్కరూ పర్యావరణ సమతుల్యత పట్ల సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. మానవ మనుగడకు రక్షణకవచం లాంటి ప్రకృతిని విధ్వంసం చేయడం మనల్ని మనం ప్రమాదంలో పడేసుకోవడమేననీ, మన చుట్టూ ఆవరించి ఉన్న ప్రకృతిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రకృతిలో లభ్యమయ్యే వనరులను అవసరాలకు మించి వినియోగించడం, ధనాశతో, దురాశతో దూరదృష్టి కోల్పోయి, పర్యావరణానికి చేటుతేవడం మానవ మనుగడకు పెను ముప్పుని పచ్చదనమే ప్రపంచ మానవాళికి నిజమైన ధనమన్నారు. మానవాళి మనుగడకు మూలాధారమైన ధరిత్రి పదిలంగా ఉండాలంటే పచ్చని ప్రకృతిని పరిరక్షించుకోవాలన్నారు. స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు ప్రసంగిస్తూ ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడు తుందన్నారు. అవాంఛనీ యమైన వాతావరణ మార్పులను అరికట్టి, కాలుష్యాన్ని కొంత వరకైనా నిరోధించ గలిగితేనే భూమిపై జీవరాశుల అస్థిత్వం కొన సాగుతుందన్నారు. సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ పై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. ఆధునికత, సాంకేతికత ప్రభావంతో రేడియేషన్ పెరిగి మనచుట్టూ ఉన్న పలురకాల పక్షి జాతులు అంతరించి పోవడం చూస్తున్నామనీ ప్రకృతి సమతుల్యం లోపించ డంతో జీవవైవిధ్యం దెబ్బతిని మానవ నివాసయోగ్యం కాని ప్రదేశంగా భూగ్రహం పరివర్తన చెందుతుంద న్నారు. పర్యావరణ వ్యవస్థను పచ్చదనంతో పునఃప్రతిష్ఠించడానికి ప్రణాళికలు రచించి అమలు చేయాలన్నారు. ప్రకృతిలో సాంప్రదాయేతర ఇంధనాల వనరుల వాడకం ద్వారా సహజ సిద్ధమైన, కలుషిత రహి తమైన వాతావరణాన్ని పునర్జీవింపచేయాలన్నారు. ఈ కాలుష్య కట్టడికి కాలుష్య నియంత్రణ మండళ్లతోపాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు ఇలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచన చేయాలన్నారు ప్లాస్టిక్ పునర్వినియోగం పై దృష్టి పెట్టాలన్నారు. ప్లాస్టిక్లోని రసాయనాలు పర్యావరణానికి, సకల జీవులకూ హాని కలిగిస్తు న్నాయన్నారు. ప్రధానం గా మానవ శరీరంలోని హార్మోన్ వ్యవస్థను అస్తవ్యస్తం చేయడంతో పాటు క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతు న్నాయన్నారు. ప్లాస్టిక్ కు బదులు సంప్రదాయ గుడ్డ సంచులు, జనపనార బ్యాగులు, విస్తళ్లు, పేపర్ గ్లాసులు తదితర ప్రత్యా మ్నాయాలు వాడాలన్నా రు. పురపాలక సంఘ చైర్పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి మాట్లా డుతూ స్వచ్ఛభారత్- స్వస్థ భారత్ సాధనకై సుస్థిరాభివృద్ధితో కూడిన స్వయం సమృద్ధి భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాల న్నారు. ప్రకృతితో మానవునికి అవినాభావ సంబంధం ఉందని, పర్యావరణ పరిరక్షణకై బహుముఖ పాత్ర పోషించాలని సూచించారు. అటవీ క్షీణత - పెరుగుతు న్న కాలుష్యం, మానవ తప్పిదాలు పర్యావరణ ప్రకృతి విధ్వంసం వంటి అంశాలపై దృష్టి సారిం చాలన్నారు. ప్రకృతి వాతావరణ, పర్యావరణ సమతుల్యత మానవ మనుగడకు ఎంతో అవసరమన్నారు. చివరిగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేసి పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఆర్డీవో కె మాధవి, ఎంపీడీవో బాబ్జి రాజు, తాహసిల్దార్ అశోక్ మున్సిపల్ అధికారిని రాణి, మెట్ల రమణబాబు, డి సి ఎం ఎస్ చైర్మన్ చంద్రమౌళి, కర్రి (రామస్వామి దత్తుడు), బోనం సత్తిబాబు, కౌన్సిలర్ బొర్రా చిట్టిబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# చెట్లు లేకుంటే మానవ మనుగడకు ప్రమాదం..

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి.

చెట్లు నాటి వాటిని పెంచడాన్ని యువత ఫ్యాషన్ గా తీసుకోవాలి...

తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పిలుపు.

:పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రేణిగుంట పాత చెక్ పోస్ట్ కూడలిలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే






బొజ్జల సుధీర్ రెడ్డి,గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ తో కలిసి చెట్లను నాటి నీరు పోశారు. అనంతరం తుడా వైస్ చైర్మన్ మౌర్య పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని గుర్తు చేశారు. ముందు చూపుతో స్వర్గీయ ఎన్టీ రామారావు అనేక ప్రాంతాలలో హెలికాప్టర్ ద్వారా విత్తనాలు చల్లి చెట్లను వనాలకు అభివృద్ధి చేసారని అదేవిధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం హరితాంధ్ర విజన్ తో రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మొక్కలను నాటించారని గుర్తు చేశారు.వారిని స్ఫూర్తిగా తీసుకున్న తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కూడా నియోజకవర్గంలో లక్షలాది మొక్కలు నాటించారని నేడు శ్రీకాళహస్తి మొత్తం పచ్చదనంతో ఉందంటే ఆయన ముందు చూపేనని పేర్కొన్నారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటి బయట ప్రతి ఒక్కరు పొల్యూషన్ తో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. పొల్యూషన్ తగ్గాలన్న, మనిషి ఆరోగ్యం గా జీవించాలన్న చెట్లు నాటడం ఒకటే మార్గమని పేర్కొన్నారు. యువత చెట్లను నాటి వాటిని పెంచడం ఒక ఫ్యాషన్ గా తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తుడా పరిధిలో దాదాపు 30 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నామన్నారు. రేణిగుంట లో ఉన్న చెరువులను కూడా తుడా నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నెక్స్ట్ జనరేషన్ బాగుండాలంటే ప్రస్తుతమున్న మన జనరేషన్ మొక్కలు నాటక తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు తుడా, అటవీ పర్యావరణ శాఖ అధికారులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ.....
## రోగులకు, వృద్ధులకు, దివ్యంగులకు ఇంటి వద్దకే రేషన్




(జి ఎన్ రావు:కోనసీమ జిల్లా: కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడస కుర్రు-(షాప్ నెంబర్ :0455001:కారేం వెంక ట్రావు)చౌక దుకాణం లో జూన్ 1 నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ చేస్తున్నారు. దుకాణాలలో ప్రభుత్వ నిర్దేశిత ప్రకారం కార్డుదారులు ఉదయం నుంచిరెండు పూటలా చౌక దుకాణాల వద్ద సామాగ్రి ఇస్తున్నారు. ప్రతి ఒక్క కార్డుదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.వృద్ధులకు, వికలాంగులకు,మంచం మీదవున్న రోగులకు, ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసారు.

## ఆత్మ గౌరవ భరోసా సభను విజయవంతం చేయాలి
## బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్.



(స్వామి) గూడూరు: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అంబేద్కర్ పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న బీసీ ఆత్మ గౌరవ భరోసా సభను విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్, గూడూరు నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు తల్లం ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాల వద్ద గూడూరు నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తల్లం ప్రసాద్ ఆధ్వర్యంలో బిసి ఆత్మగౌరవ భరోసా గోడపత్రికలను విడుదల చేశారు. ముందుగా జ్యోతిరావు పూలే దంపతులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు, విద్యా ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించడం, బీసీల రక్షణ కోసం ప్రభుత్వాన్నికి తెలిపేందుకు బీసీ లందరూ ఐక్యతగా ఉండేలా ఆత్మ గౌరవ భరోసా సభను ఈనెల 22వ తేదీన తిరుపతిలోని ఇందిరా మైదానంలో నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఈ ఆత్మ గౌరవ భరోసా సభకు రాష్ట్ర మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వారికి బీసీల సమస్యలపై వివరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గూడూరు నియోజకవర్గంలోని బీసీ లందరూ ఐక్యతగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం గూడూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా ముమ్మడి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడిగా జగన్నాథం తదితరులను ఎన్నుకొని వారి కండువా కప్పి సంక్షేమ సంఘం కోసం సమిష్టి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాసిన భాస్కర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్, తిరుపతి పట్టణ అధ్యక్షులు జగదీష్, ఉదయగిరి మోహన్ గౌడ్, తిరకాల పురుషోత్తం గౌడ్, కల్లూరి భరత గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని అదనపు అంతస్తు కు ప్లానింగ్ సెక్రెటరీ అండ

### జోన్-8 లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు!!!

### చినముషిడివాడ చేపల మార్కెట్ ఎదురుగా నిబంధనలు పట్టని నిర్మాణం!!!



విశాఖపట్నం : జీవీఎంసీ పరిధి జోన్-8 లో ఇటీవల అక్రమ నిర్మాణాలు గణనీయంగా పెరిగాయి. జీవీఎంసీకి కమిషనర్ కూడా లేకపోవడంతో ఏసీపీలు, టీ పి ఓ లు, స్థానిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు బిల్డర్ల నుండి భారీ స్థాయిలో ముడుపులు అందుకుంటూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. ఈ జోన్ పరిధిలోని 97వ వార్డులో చినముషిడివాడ చేపల మార్కెట్ కు ఎదురుగా ప్లాన్ కు విరుద్ధంగా టౌన్ ప్లానింగ్ విభాగం నుండి ఎటువంటి అనుమతి తీసుకోకుండా అదనపు అంతస్తును నిర్మిస్తున్నారు. టీ పిఓ కు, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ కి ఈ అక్రమ నిర్మాణం పై ఫిర్యాదులు వెళ్లిన వారు తమకేమీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే భారీగా ముడుపులు అందుకున్న అవినీతి అధికారులు జీవీఎంసీ ఆదాయానికి గండి కొట్టారు. ప్లాన్ కు విరుద్ధంగా జరుగుతున్న ఈ నిర్మాణం పై సిసిపి ప్రభాకర్ దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# జనం మనం కార్యక్రమం



చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో వనం మనం

తిరుపతి, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జనం మనం కార్యక్రమంలో భాగంగా తుమ్మలగుంట గ్రామ పంచాయతీ లో వనం -మనం కార్యక్రమం స్మశాన వాటికలో ఘనంగా నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రం చేసి టెంకాయ మొక్కలు నాటి నీళ్లు పోశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది,సచివాలయం సిబ్బంది, తుమ్మలగుంట గ్రామ తెలుగు దేశం పార్టీ నాయకులు బిరుదాల భాస్కర్ రెడ్డి,మాజీ యం పి టి సి ఎస్.సరస్వతి,బి.సిద్దారెడ్డి,యోగానంద రెడ్డి,సిద్దయ్య, సుబ్రమణ్యం,విజయ్ కుమార్, వెంకటసుబ్బయ్య,మణి తదితరులు పాల్గొన్నారు.

## యోగ డే నిర్వహణకు బోయకొండలో స్థల పరిశీలన




చౌడేపల్లి జూన్ 5 : ఈనెల 9న యోగా డే నిర్వహించేందుకు పలమనేరు ఆర్టీవో భవాని ఆధ్వర్యంలో శక్తి క్షేత్రం బోయకొండ లో స్థలాన్ని పరిశీలించారు తొలుత ఆర్టీవో భవాని కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు అనంతరం గోశాల వద్ద దాదాపు 2000 మంది యోగాసనాలు వేసే విధంగా సరిపడా స్థలాన్ని పరిశీలించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హనుమంతు ఎంపీడీవో లీలా మాధవి బోయకొండ ఈవో ఏకాంబరం పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జోన్ -ఏసిపి మధు పై బదిలీ వేటు

### జోన్ పరిధిలో విచ్చలవిడిగాఅక్రమ నిర్మాణాలు!!!

### చర్యలు తీసుకోవడంలో విఫలం!!

### భారీగా ముడుపులు అందుకుంటున్నారని ఆరోపణలు!!



విశాఖపట్నం : ఏ జోన్ లోను లేని విధంగా ఒక్క జోన్ - 3 లోనే అనేక అక్రమ నిర్మాణాలు శర వేగంగా పూర్తి చేసుకుంటున్నాయి. ఏసీపీగా మధుసూదన్ రావు బాధ్యతలు స్వీకరించిన తర్వాత జోన్-3 పరిధిలోని ప్రతి వార్డు ల్లోను ప్లాన్ కు విరుద్ధంగా జరిగే నిర్మాణాలు గణ నీయంగా పెరిగాయి. ఇరుకు సందుల్లోనూ, గెడ్డ ల పక్కన, కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని వీధుల్లో బహుళ అంతస్తులు నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిపై అనేక ఫిర్యాదులు వెళ్లిన చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. కార్పొరేటర్ చెప్పాడనో, రాజకీయ పలుకుబడే ఉందని చెప్పి కొంతమంది టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమార్కులకు మద్దతు పలుకుతున్నారు. రెసిడెన్షియల్ ప్లాన్ తీసుకొని, కమర్షియల్ నిర్మాణం జరుగుతున్న చర్యలు తీసుకోవడం లేదంటే టౌన్ ప్లానింగ్ విభాగం విఫలమయ్యిందో అర్థం చేసుకోవచ్చు. జనవరి నుండి మే వరకు ఒక్క అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఒకవైపు జీవీఎంసీ ఫీజులు రూపేణా రావలసిన ఆదాయానికి గండిపడుతుంటే, మరోవైపు టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ సెక్రటరీ లు కోట్లాది రూపాయల ఆస్తులు మూటగట్టుకుంటున్నారు. ఏ సిపి స్థాయి అధికారి అధికారులను,సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన వున్నా జోన్ -3లో ఆ పరిస్థితి కనబడటం లేదు. రెండు మూడు రోజుల్లో కొత్త కమిషనర్ వస్తున్నారని, ఏసీపి మధుసూదనరావు పై కఠిన చర్యలు ఉంటాయని జీవీఎంసీలో గుసగుసలు వినబడుతున్నాయి.



## వరుస పేలుళ్లలో కూలిన బ్రిడ్జిలు, పట్టాలు తప్పిన రైళ్లు



మాస్కో : పశ్చిమ రష్యాలో అర్ధరాత్రి పేలుళ్లతో రెండు బ్రిడ్జిలు కూలిపోగా, రెండు రైళ్లు పట్టాలు తప్పాయి. ఈ ఘటనల్లో ఏడుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఈ 'ఉగ్రవాద చర్యలు'పై దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పేలుళ్లకు గల కారణాన్ని అధికారులు వెల్లడించలేదు. రెండు పేలుళ్లు ఉక్రెయిన్ సరిహద్దులో ఉన్న రష్యన్ ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి. జూన్ 2న జరగనున్న రష్యా ఉక్రెయిన్ చర్చలకు ఒకరోజు ముందు ఈ పేలుళ్లు జరిగాయి. సమీపంలో ఉన్నాయని అన్నారు. ఉక్రెయిన్ సరిహద్దులోని బ్రయాన్స్క్ ప్రాంతంలో ఉన్న మొదటి వంతెన శనివారం ఒక ప్యాసెంజర్ రైలుపై కూలిపోవడంతో ఏడుగురు మరణించారు. క్లిమోవో-మాస్కో రైలు 388 మంది ప్రయాణికులతో వెళుతుండగా వంతెనపై పేలుడు జరిగిందని ఆ ప్రాంత గవర్నర్ అలెగ్జాండర్ బోగోమాజ్ స్థానిక మీడియాతో పేర్కొన్నారు. బ్రయాన్స్క్ వంతెన కూలిపోయిన కొన్ని గంటల తర్వాత, ఉక్రెయిన్ సరిహద్దులోని కుర్స్క్ ప్రాంతంలో వంతెన కూలిపోవడంతో మరో రైలు పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు. పేలుడు ధాటికి వంతెన కూలిపోవడంతో గూడ్స్ రైలు పట్టాలపై నుండి రహదారిపై పడిందని ఆ ప్రాంత తాత్కాలిక గవర్నర్ అలెగ్జాండర్ ఖిన్‌స్టెయిన్ ఆదివారం తెలిపారు. ఈప్రమాదంలో మంటలు చెలరేగాయని, కానీ ప్రాణ నష్టం జరగలేదని అన్నారు.

## మాజీ ప్రధాని షేక్ హసీనాపై మరో అభియోగం



ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై మరో అభియోగం నమోదైంది. 2024 విద్యార్థుల నేతృత్వంలోని తిరుగుబాటును హింసాత్మకంగా అణచివేయడంతో పాటు మానవత్వంపై క్రూరత్వం నేరాలకు సంబంధించి ఆమెపై అభియోగాన్ని మోపినట్లు ప్రాసిక్యూటర్లు ఆదివారం తెలిపారు. షేక్ హసీనాతో పాటు మరో ఇద్దరు అధికారులపై ఈ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర భద్రతా దళాలు, ఆమె రాజకీయ పార్టీ మరియు అనుబంధ సమూహాలు భారీ ప్రాణ నష్టం కలిగేలా ఆపరేషన్లు నిర్వహించాలని హసీనా నేరుగా ఆదేశించారని దర్యాప్తు నివేదికలో తేలింది. "ఈ హత్యలు ప్రణాళిక ప్రకారం జరిగాయి" అని వీడియో ఆధారాలు, వివిధ ఏజన్సీల దర్యాప్తును ఉటంకిస్తూ చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం ఆదివారం మీడియాకి తెలిపారు. ఈ కేసులో 81మందిని సాక్షులుగా చేర్చామని అన్నారు. ప్రభుత్వ అధినేతగా హసీనా, ఉద్రిక్తతల సమయంలో భద్రతా దళాల కార్యకలాపాలకు బాధ్యత వహిస్తారని పేర్కొన్నారు. ఉద్రిక్తతల్లో 1500 మంది మరణించగా, 25,000 మంది గాయపడినట్లు ఇస్లాం తెలిపారు. నిరసనకారుల ఒత్తిడితో హసీనా ఆగస్టులో అధ్యక్ష పదవికి రాజీనామా చేసి దేశాన్ని విడిచి పారిపోయారు. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఆమెతో పాటు కుటుంబసభ్యులు కూడా పలు అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు.

## అతి పిన్న వయస్కురాలైన ఎంపీను పెళ్లాడబోతున్న భారత క్రికెటర్




ఉత్తరప్రదేశ్: భారతదేశంలోని అతి పిన్న వయస్కురాలైన ఎంపీలలో ఒకరైన ప్రియా సరోజ్ ను భారత క్రికెటర్ రింకు సింగ్ పెళ్లాడబోతున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని మఛ్లిషహర్ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సభ్యురాలిగా (ఎంపి) ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రియా సరోజ్ జూన్ 8న క్రికెటర్ రింకు సింగ్‌తో నిశ్చితార్థం కానుంది. ఈ వేడుక లక్నోలోని ఒక హోటల్‌లో జరగనుంది.

### ప్రియా సరోజ్ ఎవరు?

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని కారి?యోన్ గ్రామానికి చెందిన ప్రియా, భారతదేశంలోని అతి పిన్న వయస్కురాలైన ఎంపీలలో ఒకరిగా తన హోదాను సుస్థిరం చేసుకున్నారు. ఆమె తండ్రి తుఫానీ సరోజ్ మూడుసార్లు ఎంపీగా పనిచేసి, ప్రస్తుత కెరాకట్ ఎమ్మెల్యేగా ఉన్నారు. 2024లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ప్రియా సమాజ్‌వాదీ పార్టీ తరుపున తొలిసారి ఎంపీగా గెలుపొందారు. ప్రత్యర్థ అభ్యర్థి బిజెపి సీనియర్ నాయకుడు బిపి సరోజ్‌ను 35,000 ఓట్లకు పైగా ఓట్లతో ఆమె ఓడించింది. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుండి వచ్చినప్పటికీ, ప్రియా ప్రారంభ కెరీర్ ఆకాంక్షలు రాజకీయాలకు దూరంగా ఉన్నాయి. "పెరిగినప్పుడు, నేను రాజకీయాల్లోకి అడుగుపెడతానని ఎప్పుడూ ఊహించలేదు" అని ప్రియా ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు ఆమె సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తిని అభ్యసించారు.

## తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యూపీఎఫ్..



**హైదరాబాద్, :** తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యూపీఎఫ్ నిలిచింది. యూపీఎఫ్ నూతన కార్యవర్గంఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. కన్వీనర్ గా బొల్లా శివశంకర్, అడ్వైజర్ గా గట్టు రామచందర్ రావును నియమించారు. అనంతరం తెలంగాణ జాగృతి కార్యాలయంలో యూపీఎఫ్ నాయకులతో కవిత సమావేశం నిర్వహించారు. త్వరలోనే బీసీ బిల్లులు సాకారం అయ్యేందుకు కార్యచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. కాగా.. తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత వ్యవహారం సంచలనంగా మారింది. కవిత.. కేసీఆర్‌కు రాసిన లేఖతో వివాదం మొదలు కాగా.. తాజాగా చిట్ చాట్‌లో చేసిన వ్యాఖ్యలతో మరింత ముదిరింది. కవిత వ్యాఖ్యలపై తెలంగాణ రాజకీయాల్లో వాడీవేడీ చర్చ జరుగుతుంది. ఆమె పార్టీ మారుతుందంటూ జోరుగా ప్రచారం సాగుతున్న వేళ.. కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్సీ కవిత.. నిన్న (శనివారం) కొత్త ఆఫీస్ ప్రారంభించారు. జాగృతి కార్యకలాపాలు నిర్వహించేందుకు గాను ఈ ఆఫీసును వినియోగించనున్నారు. ఆమె తన నివాసం పక్కనే కొత్త జాగృతి కార్యాలయాన్ని.. ఏర్పాటు చేశారు. అద్దె భవనంలో ఈ ఆఫీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'కేసీఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో జాగృతి సంస్థ ఏర్పడింది. ఈ సంస్థను ప్రారంభించి 18ఏళ్లు అయింది. ఇప్పటి వరకు అశోక్‌నగర్‌లో జాగృతి కార్యాలయం ఉండేది.. ఇప్పుడు బంజారాహిల్స్‌కు మార్చాం. ఇకపై ఇక్కడి నుంచే సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తాం. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎందరో ఆశీస్సులు అందించారు. మేము చేసిన ఉద్యమాల వల్ల చాలా జీవోలు వచ్చాయి. గత పదేళ్ల కేసీఆర్ పాలనకు.. ఇప్పటి కాంగ్రెస్ పాలనకు ఎంతో తేడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలి. అమరవీరులకు నివాళులు అర్పించాలి. కనీసం రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా రేవంత్‌రెడ్డి.. 'జై తెలంగాణ' అనాలి.

# చేష్టలుడిగిన ఐక్యరాజ్యసమితి



డొనాల్డ్ ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత, ఆయన విధానాలు ఐక్యరాజ్యసమితి (యుఎన్) దాని భద్రతా మండలి, ఇతర సంస్థలు గణనీయంగా బలహీనపడినాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఇజ్రాయెల్ -గాజా (పాలస్తీనా) సంఘర్షణలు మానవ హక్కుల ఉల్లంఘనలు, మానవ జాతి హననం వైపు దారితీస్తున్నాయి. ఈ యుద్ధాలు అమెరికా నుండి ప్రత్యక్ష, పరోక్ష ఆర్థిక, ఆయుధ సహాయంతో సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. ప్రపంచంలో ఉగ్రవాదులకు నిలయాలుగా ఉన్న పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మొదలైన దేశాల్లో వారిని పెంచి పోషించింది అమెరికానే. వారికి ఆర్థిక సహాయం చేసింది, ఆయుధాలు సమకూర్చిందీ, సైనిక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించిందీ అమెరికానే. ఈ సంఘర్షణలలో వేలాది సైనికులు, సామాన్య పౌరులు, మహిళలు, పిల్లలు, వృద్ధులు మరణిస్తున్నారు. గాజాలో ప్రజలు ఆకలి మంటలతో అల్లాడుతున్నారు, గాయాలతో సతమతమవుతున్నారు. ఇజ్రాయెల్ బాంబులతో వైమానిక దాడులు, అక్కడ ప్రజలకు తాగటానికి నీరు, తినటానికి ఆహారం, గాయాలకు, రోగాలకు ఔషధాలు అందకుండా చేస్తుంది. వారికి నిలువనీడ లేకుండాపోయింది. ప్రాణభయంతో వృద్ధులు, స్త్రీలు, పిసిపిల్లలతో పడుతూ, లేస్తూ పరుగులు పెడుతున్నారు. స్కూళ్లు, వైద్యశాలలు, ప్రార్థనా మందిరాలు ఇజ్రాయెల్ బాంబులతో ధ్వంసమయ్యాయి. ఈ ఇజ్రాయెల్ క్రూరత్వం వెనుక అండదండలు అందించేది అమెరికానే. ప్రపంచ దేశాలు మానవత్వం మరచి ఈ రెండు దేశాలను ఎదిరించలేక చేతులుకట్టుకుని, చేవచచ్చి చోద్యం చూస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి, ఇతర సభ్యదేశాల నుండి వచ్చే వైద్య సహాయాన్ని, ఆహారాన్ని ఇజ్రాయెల్ సైన్యం రాక్షసత్వం తో అడ్డుకుంటోంది. ఈ పరిస్థితులు ప్రపంచ శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. ట్రంప్ రెండవ పర్యాయంలో అమెరికా ఐక్యరాజ్యసమితి నుండి దూరమై, దాని నిధులను గణనీయంగా తగ్గించింది. 2025 ఫిబ్రవరిలో ట్రంప్ పరిపాలన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి (యుఎన్‌హెచ్ఆర్‌సి) నుండి ఉపసంహరించుకుని, పాలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్యసమితి రిలీఫ్ అండ్ వర్క్ ఏజెన్సీ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ) నిధులను నిలిపివేసింది. అమెరికా, ఐక్యరాజ్యసమితి బడ్జెట్‌లో దాదాపు 25 శాతం వాటాను సమకూర్చే ప్రధాన దాతగా, ఈ నిధుల కోతలు యుఎన్ మానవతా కార్యక్రమాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఉదాహరణకు, యుఎన్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ మయన్మార్‌లో సహాయాన్ని తగ్గించవలసి వచ్చింది. భద్రతా మండలిలో అమెరికా వీటో అధికారాన్ని ఉపయోగించి, గాజాలో మానవతా కోణంలో యుద్ధ విరామం కోసం ఉద్దేశించిన ప్రతిపాదనలను అడ్డుకుంది. 2023 అక్టోబర్‌లో బ్రెజిల్ ప్రతిపాదించిన ఒక తీర్మానం, గాజాలో మానవతా సహాయానికి అవసరమైన విరామం కోసం పిలుపునిచ్చినప్పటికీ అమెరికా వీటో కారణంగా విఫలమైంది. ఈ చర్యలు ఐక్యరాష్ట్రాల సంస్థ శాంతి స్థాపన లక్ష్యాలను అమలు చేయడంలో విఫలమవడానికి దోహదపడ్డాయి. ఇప్పుడు అమెరికా నిధులు మంజూరు చేయకపోవడంతో ఐక్యరాజ్యసమితి నిర్వీర్యం అయింది. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు ఏకగ్రీవంగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై యుద్ధం పేరుతో పసిబిడ్డలతో సహా మానవ మారణకాండను కొనసాగిస్తున్నందుకు అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయినా తన వీటో పవర్‌తో అడ్డుకుంటుంది. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ట్రంప్ పరిపాలన ఉక్రెయిన్‌కు సైనిక సహాయాన్ని నిలిపివేసి రష్యాతో శాంతి చర్చలను ప్రోత్సహించింది. 2025 ఫిబ్రవరిలో అమెరికా రష్యాతో రియాద్‌లో చర్చలు జరిపింది, ఉక్రెయిన్‌ను ప్రక్కన పెట్టి. ఈ చర్యలు ఉక్రెయిన్ భూభాగ సార్వభౌమత్వాన్ని రాజీచేసే అవకాశం ఉందని విమర్శలు వచ్చాయి. యుద్ధం కారణంగా ఐరోపాలో రక్షణ ఖర్చులు పెరిగాయి. నాటో భవిష్యత్తు అనిశ్చితంగా మారింది. ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక స్థిరత్వాన్ని, శక్తి సరఫరాను, ఆహార భద్రతను దెబ్బతీసింది. గాజా సంఘర్షణలో, ట్రంప్ విధానాలు ఇజ్రాయెల్‌కు అనుకూలంగా, పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఉన్నాయి. 2025 ఫిబ్రవరిలో, ట్రంప్ గాజాను 'మధ్యధరా రివియెరా'గా మార్చడానికి పాలస్తీనియన్లను ఈజిప్ట్, జోర్డాన్‌కు బలవంతంగా తరలించాలని ప్రతిపాదించాడు. దీనిని ఐక్యరాజ్యసమితి సంస్థ జాతి శుద్ధీకరణగా ఖండించింది. ఈ ప్రతిపాదన అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే కాక, ఈజిప్ట్, జోర్డాన్‌తో ఇజ్రాయెల్ శాంతి ఒప్పందాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. గాజాలో 47,552మంది పౌరులు మరణించారు. 111,629 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ కక్షకట్టి బాంబు దాడులు చేస్తూనే ఉంది, ఎవరు హితబోధ చేసినా వినే పరిస్థితిలో లేదు. ఈ యుద్ధాలు పర్యావరణ విధ్వంసాన్ని కలిగించాయి. గాజాలో 69 శాతం భవనాలు ధ్వంసమయ్యాయి. 92 శాతం గృహాలు, 88 శాతం పాఠశాలలు నాశనమయ్యాయి. బాంబు దాడులు, అలాగే ఇంధన వినియోగం వాయు కాలుష్యాన్ని పెంచాయి. ఉక్రెయిన్ యుద్ధం శక్తి సరఫరా గొలుసులను అడ్డుకుంది, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని పెంచింది, ఇది వాతావరణ మార్పులను తీవ్రతరం చేసింది. ట్రంప్ విధానాలు ఐక్యరాష్ట్రాల సంస్థను బలహీనపరిచి, ప్రపంచ శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీశాయి. అమెరికా ఏకపక్ష చర్యలు, నిధుల కోతలు, ఇజ్రాయెల్‌కు అనుకూల వైఖరి సంఘర్షణలను మరింత తీవ్రతరం చేశాయి. ఐక్యరాష్ట్రాల సంస్థ ఆదర్శాలు, లక్ష్యాలు అమలుకు నోచుకోవడం లేదు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి, సభ్యదేశాలు సమష్టిగా బాధ్యత తీసుకొని, అంతర్జాతీయ చట్టాలను గౌరవించే విధంగా శాంతి చర్చలను ప్రోత్సహించాలి. ప్రపంచ శాంతికోసం ఐక్యరాష్ట్రాల సంస్థ బలోపేతం కావాలి. లేకపోతే మానవతా సంక్షోభాలు మరింత తీవ్రమవుతాయి.

# ఆర్థిక వ్యవస్థపై అంకెల గారడీ



భారతదేశం 4 ట్రిలియన్ల డాలర్ల జిడిపి మార్క్‌ను దాటి, జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇది గొప్ప విజయమని వేడుక చేసుకుంటున్నారు. కానీ నిశితంగా పరిశీలిస్తే ఆనందాన్ని తగ్గించే ముఖ్యమైన ఆర్థిక సవాళ్లు వెల్లడవుతాయి. ఈ వృద్ధి చేరిక గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. తక్కువ తలసరి జిడిపి ద్వారా దెబ్బతిన్న మైలురాయి భారతదేశం మొత్తం జిడిపి 1.4 బిలియన్లకు పైగా ఉన్న, అధిక జనాభాను ప్రతిబింబిస్తున్నప్పటికీ, దాని తలసరి జిడిపి వేరే కథను చెబుతుంది. భారతదేశం 2,878 డాలర్ల వద్ద ఉంది. జపాన్ 33,138 డాలర్లు, యుకె 55,000 డాలర్లు కంటే చాలా వెనుకబడి ఉంది. ఈ స్పష్టమైన అసమానత ఆర్థిక వృద్ధి ప్రయోజనాలు సగటు పౌరుడికి చేరడం లేదని, వ్యక్తిగత శ్రేయస్సు కోట్లాది మందికి అందుబాటులో లేదు. రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగస్థులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఆర్థికమాంద్యం సంకేతాలు ఇటీవల డేటాని పరిశీలిస్తే ఆందోళనకరమైన చిత్రాన్ని చిత్రీకరిస్తుంది. గృహ పొదుపులు ఫైనాన్షియల్ ఇయర్ 2020లో 11.61 లక్షల కోట్ల నుంచి ఫైనాన్షియల్ ఇయర్ 25లో 6.52 లక్షల కోట్లకు పడిపోయాయి. ఇది తగ్గిన ఆర్థిక భద్రతను సూచిస్తుంది. ఫైనాన్షియల్ ఇయర్ 25 లో బంగారంపై రుణాలు 71% పెరుగుదల చాలా మంది భారతీయులు ప్రాథమిక అవసరాలను తీర్చడానికి ఆస్తులు రద్దు చేస్తున్నారు అని సూచిస్తుంది. వినియోగదారు మార్కెట్ కూడా ఇబ్బందిపడుతున్నాయి. ఫైనాన్షియల్ ఇయర్ 2025లో ఆటో అమ్మకాలు 6% స్వల్పంగా పెరిగాయి. ద్విచక్ర వాహనం, వినియోగ వస్తువులు (ఎఫ్ఎంసిజి) అమ్మకాలలో మందగమనంతోపాటు, బలహీనమైన డిమాండ్‌ను సూచిస్తున్నాయి. ఆర్థిక బాధ, మానవ నష్టం ఈ సవాళ్ల మానవ నష్టం ఆందోళనకరమైనది. ఆర్థిక సంక్షోభం రోజుకు 19 ఆత్మహత్యలతో ముడిపడి ఉంది. ప్రతి గంటకు ఇద్దరు రైతులు తమ ప్రాణాలను బలిగొంటారు. ఈ గణాంకాలు వ్యవసాయంలో లోతుగా పాతుకుపోయిన సమస్యలను విస్తృతమైన ఆర్థిక ఒత్తిడిని సూచిస్తున్నాయి. అప్పు, నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి లక్ష్యంగా చేసుకున్న జోక్యాల అవసరాన్ని నొక్కిచెబుతున్నాయి. మధ్యతరగతి పోరాటాలు, తక్కువ వేతనాలు భారతదేశ మధ్యతరగతి, తరచుగా ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా పరిగణించబడుతుంది. తీవ్ర ఒత్తిడిలో ఉంది. సగటు మధ్య తరగతి ఆదాయం సంవత్సరానికి రూ. 2.6 లక్షలు (నెలకు రూ. 22,000). ఇది 1820లో వలస రాజ్యాల ముందు భారతదేశంతో పోల్చదగిన స్థాయి. ద్రవ్యోల్బణంతో కలిసిన ఈ స్తబ్దత కొనుగోలు శక్తిని తగ్గించింది. అదనంగా, భారతదేశం సగటు గంట వేతనం ప్రపంచవ్యాప్తంగా ఐదవ అత్యల్ప స్థానంలో ఉంది. ఇది నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులను తక్కువ ఆదాయ చక్రంలో బంధిస్తుంది. వ్యవస్థాగత సమస్యలు కఠినమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఆర్థిక కథనం వ్యవస్థాగత సవాళ్లతో మరింత క్లిష్టంగా ఉంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఉద్యోగాలకు పెరుగుతున్న డిమాండ్ గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర నిరుద్యోగాన్ని సూచిస్తుంది. జనాభాలో దాదాపు 60% మంది 800 మిలియన్లకు పైగా భారతీయులకు ప్రభుత్వం ఉచిత రేషన్ పంపిణీ విస్తృతమైన పేదరికం, ఆహార అభద్రతను హైలైట్ చేస్తుంది. సమగ్ర వృద్ధికి పిలుపు భారతదేశంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం గర్వకారణం అయినప్పటికీ, జీవన ప్రమాణాలను మెరుగుపరచకపోతే జిడిపి పరిమాణం మాత్రమే ఖాళీ కొలమానం అని నిపుణులు తెలుపుతున్నారు. ప్రజల శ్రేయస్సులో పురోగతికి సరైన అర్థం ఉండాలి.

దేశంలో కోట్లాది మంది ప్రాథమిక అవసరాల కోసం పోరాడుతుంటే, దేశం నాలుగవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయింది అని సంబరపడాలా?.విధాన నిర్ణేతలు సమగ్ర వృద్ధిని నిర్ధారించడం, నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడం ఆదాయ అసమానతలను పరిష్కరించడం వంటి సవాలును ఎదుర్కొంటున్నారు. ఈ ప్రయత్నాలు లేకుండా, భారతదేశ ఆర్థిక మైలురాయి దాని పౌరుల వాస్తవాల నుండి డిస్‌కనెక్ట్ చేయబడిన గణాంకాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజలకు విద్య, ఆరోగ్యం, ఆహారం, పర్యావరణం, మెరుగైన జీవనం, సాధికారత వైపు అడుగులు వేయకుండా కేవలం అంకెల గారడీ నమ్ముకొని సంబరపడితే తీవ్ర అనర్థాలకు దారితీస్తుంది. వాపును చూసుకొని బలమనుకుంటే అంతే సంగతి.

# ప్రగతికి కులవ్యవస్థే అడ్డుగోడ



'ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి ఎక్కడైతే కొన్ని హక్కులు అనుభవిస్తున్నారో అక్కడి నుంచి వారిని తొలగించే ప్రయత్నం జరుగుతున్నది. అందులో భాగంగానే పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారు. దీనిని కేవలం ప్రైవేటైజేషన్ అనుకోవద్దు. ఇది డీ దళిత్ ఫికేషన్, డీ ఒబిసి ఫికేషన్ అనాలి. ఎందుకంటే ఆయా వర్గాలను అవకాశాల నుంచి దూరం చేస్తున్నారు" అని కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, రాహుల్ గాంధీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. గత నాలుగు రోజుల క్రితం ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థులతో అదే క్యాంపస్‌లో కలుసుకొని మాట్లాడుతూ, "మీరు ప్రతి చోటా భాగస్వామ్యం గురించి, అవకాశాల గురించి మాట్లాడుతున్నారు. వాటిని కల్పించే అధికారం గురించి మాట్లాడాలి. కేవలం అవకాశాల గురించి ఆలోచిస్తే ప్రయోజనం లేదు. ఉదాహరణకు విద్యార్థులుగా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు చాలా మంది ఉన్నారు. కానీ ప్రొఫెసర్లలో ఎవ్వరూ లేరని మీరే చెబుతున్నారు. అటువంటిప్పుడు మీరు సరైన మార్గదర్శకత్వం పొందలేరు" అని తన సమాధానంలో రాహుల్ చెప్పారు. ఈ సంభాషణ ఇప్పుడు చాలా చోట్ల చర్చనీయాంశంగా మారింది. అదే విధంగా మరొక విషయాన్ని రాహుల్‌గాంధీ, ప్రత్యేకంగా పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక వనరులున్న రంగాలు ముఖ్యంగా కార్పొరేట్లు, కాంట్రాక్టు పనుల కేవలం కొన్ని సెక్షన్ల చేతుల్లో ఉన్నాయని, ఈ విషయం లెక్కలతో సహా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో తేలిందని కూడా ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు ఎస్‌సి, ఎస్‌టి ఒబిసిలకు అవకాశాలను అందకుండా చేయడం, నిర్ణయాధికారం కలిగిన పదవుల్లో, హోదాల్లో వారికి స్థానం కల్పించకపోవడం వల్ల ఈ వర్గాలు రోజురోజుకు ఇంకా ఇంకా దిగజారిపోతున్నాయి. ఇది వాస్తవం. ముఖ్యంగా జ్ఞానానికి, ఆర్థిక రాజకీయ అధికారానికి దూరంగా ఉంచే ప్రక్రియ గత రెండు వేల ఏళ్ళుగా కొనసాగుతున్నది. భారతదేశ చరిత్రను మనం చాలా సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే ఈ విషయాలు మనం అర్థం కాగలవు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా రాజ్యం ఏలుతున్నది కుల వ్యవస్థ రక్షకులు మాత్రమే. తాము ఏ స్థానంలో ఉన్నామో ఆ స్థానాలనకు ప్రమాదం వాటిల్లకుండా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. మనువాదం అనేది నాటికి, నేటికీ ఆధిపత్యంలోనే ఉన్నది. కొంత మంది మేధావులు మనుధర్మాన్ని మానవ ధర్మంలో రాజనీతి, ఆర్థిక శాస్త్రంగా పేర్కొంటూ, దానిని విమర్శించిన వాళ్ళ మీద మూకుమ్మడి దాడులు చేస్తున్నారు. కొన్ని సార్లు భౌతికంగా కూడా దాడులకు పాల్పడుతున్నారు. అయితే ఇప్పుడు ఆర్థిక వనరులకు, జ్ఞాన సముపార్జనకు, రాజకీయ హక్కుగా అవకాశం కల్పిస్తున్న భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. మనుధర్మంలో ఆ రోజు అంటరాని కులంగా చెప్పుకున్న చంఢాల జాతికి పెట్టిన ఆంక్షలను పరిశీలిస్తే మనకు ఈ కుల వ్యవస్థ వేదాలు ప్రబోధించే వర్ణవ్యవస్థ ఈనాటికి మరొక రూపంలో ఉనికిలోనే ఉన్నది. 'చంఢాల, స్వపక జాతులు ఊరి బయటనే ఉండాలి. చనిపోయిన జంతువుల మాంసాన్నే తినాలి. శవాల మీద వస్త్రాల ధరించాలి. వీరిని ఎవరూ తాకకూడదు. ఎటువంటి ఇళ్ళు, జాగా ఉండడానికి లేదు. శ్మశానాలలోనే నివసించాలి" ఇది చాలా స్పష్టంగా మనుస్మృతిలో పేర్కొన్నారు. అంటే ఒక రకంగా వీరికి ఎటువంటి జ్ఞానం, వనరులు ఉండడానికి వీలు లేదు. శూద్రులు విషయానికొస్తే, వీళ్ళు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలకు సేవ చేయడమే వీరి పరమావధి. చదువు, ఇతర విశ్వ విజ్ఞానం వీరు నేర్చుకోకూడదు. వీరికి ఎవ్వరూ బోధించకూడదు. ఇందులో వృత్తి పని వారి సేవలుంటాయి. వారి శ్రమతో మిగతా మూడు కులాలను సేవించాలి. నైపుణ్యం కలిగిన వృత్తి పని వారు ఉన్నప్పటికీ, వాటి ఆదాయ వనరుల మీద వారికి అంతగా హక్కులుండవు. అదే నేటికీ కొనసాగుతున్నది. ముఖ్యంగా భూమి, ఆర్థిక వనరులు వీరికి అందాల్సిన స్థాయిలో అందడం లేదు. ముఖ్యంగా దళితుల విషయానికొస్తే, పురాతన కాలం నుంచి ఎన్నో నిషేధాలు, ఆంక్షలు ఎదుర్కొనప్పటికీ, వాటిని అధిగమించి జీవిస్తూ ఈ సమాజాభివృద్ధికి పాటు పడుతూనే ఉన్నారు. భూమిని సాగు యోగ్యంగా చేసి, నీటి వనరులను సృష్టించి, వాటిని నిర్వహించి వ్యవసాయానికి తమ రక్తాన్ని, చెమటను అందించిన దళితులు ఇప్పటికీ భూమిని హక్కుగా పొందలేకపోతున్నారు. ఇప్పటికే ఉన్న భూములను కోల్పోతున్నారు. అంతేకాకుండా సమాజంలో సమాన హక్కులు ఉండాలని ఎన్నో ఏళ్లు ఎంతో మంది పోరాడి ఒక మార్గానికివస్తే ఆ హక్కు అందుకుందామంటే, అవి నిరుపయోగంగా ఉన్నాయి. రాహుల్ గాంధీ చెప్పినట్టు ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు ఏ అవకాశాలను అందుకుందామని వస్తే అవి నిరుపయోగం అవుతున్నాయి. కొన్నికులాలు వీళ్లతో భాగస్వామ్యం పంచుకోలేక మరో ప్రపంచాన్ని సృష్టించుకుంటున్నారు. ఉదాహరణకు, 1950 రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత చట్టపరంగా అందరికీ ఒకే బడిలో చదువుకునే అవకాశం వచ్చింది. అయితే అది ఎంతో కాలం సాగలేదు. ఇరవై సంవత్సరాలు దాటిన తర్వాత ప్రభుత్వం నిర్వహించే పాఠశాలలు, కళాశాలల నుంచి వెళ్లిపోయి తమ కోసమేనన్నట్టుగా ప్రైవేటు విద్యా వ్యవస్థలను నెలకొల్పుకున్నారు. సర్కారు విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, కొన్ని బిసి కులాల పిల్లలకు పరిమితమయ్యాయి. ఒకనాడు విశ్వవిద్యాలయాలు అన్ని కులాల విద్యార్థులు చదువుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వం నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయాలు ఎస్‌సి, ఎస్‌టి, కొన్ని బిసి కులాలకే పరిమితం. సర్కారు విశ్వ విద్యాలయాలు నిధులు, సిబ్బంది, ఆధునిక వసతులు ఉండవు. ఆధిపత్య కులాలు చదువుకునే ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో అత్యాధునిక వసతులు ఉంటాయి. అదే విధంగా స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో అందరూ ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లేవారు. అప్పుడు అవి సమర్థవంతంగా పని చేసేవి. అక్కడికి కింద కులాలవాళ్లు, తక్కువ కులాల వాళ్లు రావడం మొదలై వాళ్లు పడుకునే మంచాల మీద తాము పడుకోవడం నీచమని భావించి ప్రైవేటు వైద్య వ్యవస్థను తీసుకొచ్చారు. దానితో ప్రభుత్వ వైద్యశాలలు పనికి రాకుండా పోయాయి. ఈగలు, దోమలు, పనికిరాని పరికరాలు, పని చేయని వైద్యుల స్థావరాలుగా మారిపోయాయి. అదే విధంగా పబ్లిక్ రంగ సంస్థలు. ఎంతో కొంత చదువుకొని ఉద్యోగాలకు వస్తే 1970 ప్రాంతం వరకు అన్ని ప్రైవేటు పరిశ్రమలే. 1970 తర్వాత అప్పటి ప్రధాన మంత్రి చాలా రంగాల్లో పబ్లిక్ రంగ సంస్థలను నెలకొల్పింది. అందులో రిజర్వేషన్లు ఉండడం వల్ల ఎస్‌సి, ఎస్‌టిలు ఉద్యోగాలు పొందారు. కాని ఆ సంబరం ఎక్కువ కాలం లేదు. 1970 తర్వాత ఆర్థిక సంక్షోభం పేరు చెప్పి ప్రైవేటు రంగానికి గేట్లు తెరిచారు. 2000 సంవత్సరం తర్వాత పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వేగం పెంచారు. ఇప్పుడు అది మొత్తం పబ్లిక్ రంగ సంస్థ అనే పదం లేకుండా చేస్తునానరు. దీనితో తేలేదేమిటంటే, కుల వ్యవస్థ ప్రతిపాదించిన నిచ్చెన మెట్ల వ్యవస్థ అదే గ్రేడింగ్‌ను కొనసాగిస్తున్నది. సమాజంలో ఉన్న చట్టాలు, రాజ్యాంగ హక్కులు అన్ని కుల వ్యవస్థ శక్తి ముందు, మనుస్మృతి ప్రభావం ముందు దూదిపింజల్లా తేలిపోతున్నాయి. అందుకే బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్టు ఈ దేశంలో కుల వ్యవస్థను నిర్మూలించకుండా ఎటువంటి ప్రగతి అనుకున్న స్థాయిలో సాధించలేమని తేలుతున్నది.

## ముస్లిం ఓటు బ్యాంకు కోసమే మమతాబెనర్జీ ఆరాటం.. "సిందూర్", "వక్ఫ్ చట్టాన్ని"పై వ్యతిరేకత..



**న్యూఢిల్లీ,:** పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. ముస్లిం ఓటు బ్యాంకును సంతృప్తి పరచడానికి మమతా "ఆపరేషన్ సిందూర్", "వక్ఫ్ చట్టాన్ని" వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల, ముర్షిదాబాద్‌లో జరిగిన అల్లర్లు రాష్ట్ర స్పాన్సర్ చేసిందని అన్నారు. " ముస్లిం ఓటు బ్యాంకును సంతృప్తి పరచడానికి, మమతా దీదీ ఆపరేషన్ సిందూర్‌ను వ్యతిరేకించారు. అలా చేయడం ద్వారా, ఆమె ఈ దేశంలోని తల్లులు, సోదరీమణులను అవమానిస్తున్నారు. 2026 (అసెంబ్లీ ఎన్నికలు)లో, ఆపరేషన్ సిందూర్‌ను విమర్శించినందుకు రాష్ట్ర మహిళలు మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పుతారు" అని అమిత్ షా చెప్పారు. ఏప్రిల్ లో వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముర్షిదాబాద్‌లో పెద్ద ఎత్తున అల్లర్లు జరిగాయి. ఈ అల్లర్లలో టీఎంసీ నాయకులు పాల్గొన్నారని, అల్లర్ల సమయంలో బీఎస్ఎఫ్‌ని మోహరించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కోరినప్పటికీ, హింసను కొనసాగించేందుకే టీఎంసీ ప్రభుత్వం దానికి అనుమతించలేదు అని అమిత్ షా ఆరోపించారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లకు టీఎంసీ సహాయపడుతుందని చెప్పారు. "మమతా బెనర్జీ బంగ్లాదేశీయుల కోసం బెంగాల్ సరిహద్దులను తెరిచారు. ఆమె చొరబాట్లను ఎప్పటికీ ఆపలేరు, బిజెపి మాత్రమే దీన్ని చేయగలదు" అని అన్నారు. బీఎస్ఎఫ్ చొరబాట్లను ఆపలేకపోతుందని ఇటీవల టీఎంసీ విమర్శించిన నేపథ్యంలో, మమతా బెనర్జీ సర్కార్ బీఎస్ఎఫ్‌కి అవసరమైన భూమి ఇవ్వడం లేదని అమిత్ షా అన్నారు. తమకు భూమి ఇస్తే చొరబాట్లను ఆపేస్తామని, కానీ మమతా బెనర్జీ దీనికి ఒప్పుకోదని, అధికారంలో ఉండేందుకు చొరబాట్లను కొనసాగించాలని చూస్తోందని ఆరోపించారు.

## క్యాడర్ జాగ్రత్త..! కొందరు కోవర్టులు టీడీపీలో చేరుతున్నారు..




అమరావతి,:రాష్ట్రంలో వైషమ్యాలు సృష్టించేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుంది.. కొందరు కోవర్టులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు.. టీడీపీలోని చిన్న చిన్న విబేధాలకు కోవర్టులు ఆజ్యం పోస్తున్నారు.. టీడీపీ క్యాడర్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు మంత్రి కొలుసు పార్థసారథి.. నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఆయన.. నెల్లూరు నగరంలోని యాదవ్ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ప్రశంసించారు.. ఇక, టీడీపీ మహానాడు 2025లో మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టిన ఆరు పాలసీలు గేమ్ చేంజర్‌గా నిలవబోతున్నాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.. కార్యకర్తలకు, అన్నీ వర్గాల ప్రజలకీ పార్టీని చేరువ చేసేందుకు లోకేష్ కృషి చేస్తున్నారని వెల్లడించారు.. ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు.. అయితే, రాష్ట్రంలో వైషమ్యాలు సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తోంది.. కొందరు కోవర్టులు టీడీపీలో చేరుతున్నారు.. టీడీపీలో చిన్న చిన్న విబేధాలకు కోవర్టులు ఆజ్యం పోస్తున్నారు.. క్యాడర్ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.. ఇక, గత ఐదేళ్లలో తాగిన మద్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు మంత్రి కొలుసు పార్థసారథి..

## సరైన సమయంలో సరైన వ్యక్తులకు పదవులు వస్తాయి

### - ఎమ్మెల్సీ విజయశాంతి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, :**ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, విజయశాంతిలతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ రివ్యూ ముగిసింది. అనంతరం ఎమ్మెల్సీ విజయశాంతి మీడియాతో చిట్ చాట్ చేశారు. సరైన సమయంలో సరైన వ్యక్తులకు పదవులు వస్తాయని విజయశాంతి అన్నారు. ఎవరికి ఏ పదవులు ఇవ్వాలో అధిష్టానానికి తెలుసని చెప్పారు. మొన్నటి కమిటీలలో నా పేరు లేదు అంటే.. మరో కమిటీలో అవకాశం ఉంటుందేమో అని విజయశాంతి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై మీనాక్షి నటరాజన్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ నేతల్లో ఉన్న విబేధాలు, వారి మధ్య నెలకొన్న సమస్యలను సరిదిద్దే పనిలో పడ్డారు మీనాక్షి. తెలంగాణలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో వరుస మీటింగ్స్ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా నాయకులకు మీనాక్షి నటరాజన్ పలు సూచనలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని స్థానిక సమస్యలపై ఆరా తీస్తున్నారు. అటు మీనాక్షి నటరాజన్ సమీక్ష సమావేశాలు కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్, నాగర్ కర్నూల్, వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. పార్టీ పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత ఎమ్మెల్సీలు, ఎంపీలతో భేటీ అయ్యారు. ఇక సాయంత్రం కార్పొరేషన్ ఛైర్మన్లతో రివ్యూ చేయనున్నారు. కొన్ని రోజులుగా గ్రౌండ్ లెవెల్ లో పార్టీ పరిస్థితులపై సమీక్షిస్తున్నారు మీనాక్షి నటరాజన్. అటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావుతో మీనాక్షి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితులపై ఆమె రివ్యూ చేశారు.

## లోకేష్ కోసం పవన్‌ను కూడా డమ్మీ చేశారు..!



అమరావతి,:మంత్రి నారా లోకేష్ కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కూడా డమ్మీ చేశారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.. అనంతపురంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. తెలుగుదేశం కండువా కప్పుకుంటేనే పథకాలు ఇస్తాం అంటున్నారు? అని మండిపడ్డారు.. రాష్ట్రంలో ఎమ్మెల్యేల అందరికీ కమీషన్లు వస్తున్నాయి. ఇసుక, మట్టి, మద్యం ఏదీ వదలడం లేదు.. అన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు.. దొంగలే.. దొంగ దొంగ అని మాట్లాడుతున్నారు.. వైఎస్ జగన్ మీద కేసులు పెట్టి మీరు జనంలోకి వెళ్లగలుగుతారా..? అని ప్రశ్నించారు.. మీకు ఓటు వేసినందుకు మహిళల గొంతు కోశారు. రాష్ట్రానికి ఫ్లైట్ ఖర్చులు తప్ప మీ వల్ల ఎటువంటి ఉపయోగం లేదని ఫైర్ అయ్యారు.. జిల్లాలో హత్యలు, దోపిడీలు జరుగుతున్నాయి అని విమర్శించారు. ఇక, రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్ జగన్ పర్యటన, హెలికాప్టర్‌లో సాంతికే లోపాలపై మరోసారి స్పందించి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హెలికాప్టర్ కనపడగానే పోలీసులు వెనక్కి వెళ్లారు.. భద్రత వైఫల్యంతో మా మీద అక్రమ కేసులు పెడుతున్నారు అని దుయ్యబట్టారు.. అయితే, జగన్మోహన్ రెడ్డి హత్య కు ప్లాన్ చేశారు అంటూ సంచలన ఆరోపణలు చేశారు.. హెలికాప్టర్ దిగనీయబోమంటూ ఒకామె మాట్లాడుతున్నారు.. పోలీసులను. మమ్మల్ని కార్యక్రమానికి రాకుండా అడ్డుకోవడానికి మాత్రమే ఇచ్చారు అని విమర్శించారు.. రాప్తాడులో 350 మంది మీద అక్రమ కేసులు పెట్టారు. రాప్తాడులో ఇప్పటికే ముగ్గురిని హత్య చేశారన్న ఆయన.. పార్టీ లో ఎవరు క్రమ శిక్షణ తప్పిన తప్పిస్తాం.. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వారిని ఎంకరేజ్ చేస్తే వారి పైన కూడా చర్యలు ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా క్రమశిక్షణ ఉల్లంఘన కింద 120 మంది పై చర్యలు తీసుకున్నామని వెల్లడించాడు..

# సమ్మర్ క్యాంప్స్‌లోనూ ఏఐ

### ఆటలకు బదులు సాంకేతికతకు మొగ్గు ఫిజికల్ టు డిజిటల్‌కు మారిన వైనం వేసవిలోనేకాదు, ఏడాదంతా శిక్షణ మారిన సమ్మర్ క్యాంప్స్ తీరుతెన్నులు



చెస్, డ్యాన్స్, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, డ్రాయింగ్, పెయింటింగ్.. ఇవీ సమ్మర్ క్యాంప్స్ అనగానే మనకు గుర్తొచ్చేవి. అవి కూడా వేసవి సెలవుల్లోనే నేర్చుకునేవారు. కానీ, ఇప్పుడు సమ్మర్ క్యాంప్స్ అర్థమే మారిపోయింది. ఇప్పుడు ఏడాది పొడవునా ఈ క్యాంప్స్ కొనసాగుతున్నాయి. తల్లిదండ్రుల నుంచి వస్తున్న డిమాండ్ నేపథ్యంలో పాఠశాలలు, కో%-%కరిక్యులర్ యాక్టివిటీస్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థలు.. ఏడాదంతా పిల్లలను వివిధ అంశాల్లో సానబెడుతున్నాయి. మరో ఆసక్తికర అంశం ఏంటంటే.. సమ్మర్ క్యాంప్స్‌లో ప్రాధాన్యతగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నిలిచి ఔరా అనిపిస్తోంది. కోవిడ్ సమయంలో.. ముఖ్యంగా లాక్‌డౌన్‌లో విద్యార్థులు ఇంటిపట్టునే ఉన్నారు. ఆ సమయంలో పాఠశాలలూ ఆన్‌లైన్‌లోనే తరగతులు నిర్వహించాయి. దీంతో పిల్లలు మొబైల్ ఫోన్స్, ట్యాబ్స్, కంప్యూటర్లకు అలవాటుపడ్డారు. నాటి నుంచి పిల్లలకు చదువుతోపాటు.. కంప్యూటర్ పరిజ్ఞానమూ పెరిగింది. ఆన్‌లైన్ వేదికగా పిల్లలు పలు బోధనాంశాలను నేర్చుకుంటున్నారు. చాలామంది పిల్లలకు ఫిజికల్ యాక్టివిటీస్‌కు బదులు ఆన్‌లైన్ గేమ్స్ అలవాటయ్యాయి. అలా పిల్లల కార్యకలాపాలన్నీ ఫిజికల్ టు డిజిటల్ అయిపోయాయి. మరోపక్క తల్లిదండ్రులు కూడా సాంకేతికంగా తమ పిల్లల భవిష్యత్తుకు తగ్గ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఉబలాటపడుతున్నారు. ఈ పరిణామాల కారణంగానే.. సమ్మర్ క్యాంప్స్ కూడా చాలావరకు మారిపోయాయి.

### అందుకే పంపుతున్నారు

సమ్మర్ క్యాంప్స్‌కు వస్తున్న పిల్లల్లో.. ఎక్కువమంది చిన్నారుల తల్లిదండ్రులు ఉద్యోగాలు చేసేవారే. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పిల్లలను ఇంట్లో ఉంచలేక, క్యాంప్‌లకు పంపించి ఏదో ఒక యాక్టివిటీలో బిజీగా ఉంచుతున్నారు. ఇంట్లో అల్లరి భరించలేక లేదా మొబైల్ ఫోన్లకు అలవాటు పడ్డారన్న కారణంతో మరికొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను సమ్మర్ క్యాంప్‌లో చేర్పిస్తున్నారు. చాలాకొద్ది మంది మాత్రమే తమ పిల్లలు కెరీర్‌లో క్రీడలను భాగం చేసుకోవాలని భావించి క్యాంప్‌లకు పంపుతున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.

### కొత్త అంశాలు

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సమ్మర్ క్యాంప్స్ ఇప్పుడు టెక్నాలజీ, అడ్వెంచర్, లైఫ్ స్కిల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఏఐ, కోడింగ్, ఆస్ట్రానమీ, స్పేస్ టెక్నాలజీ వంటి సాంకేతిక అంశాలు వచ్చి చేరాయి. అడ్వెంచర్‌లో హార్స్ రైడింగ్, ట్రెక్కింగ్, పారాగ్లైడింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. లైఫ్ స్కిల్స్‌లో వంటలు, వ్యవసాయం, పశు సంపద గురించి తరగతులు మొదలయ్యాయి. ఆర్చరీ, చెస్‌లతోపాటు ఫొటోగ్రఫీ, సాల్సా, బెల్లీ వంటి డ్యాన్సులు.. మ్యూజిక్ కూడా సమ్మర్ క్యాంప్స్‌లో నేర్పిస్తున్నారు. స్విమ్మింగ్, స్కేటింగ్ వంటి వాటిలోనూ కొన్నిచోట్ల శిక్షణ ఇస్తున్నారు.

### ఏఐ, ఎంఎల్, కోడింగ్..

పాఠ్యాంశాలతోపాటు కో-కరిక్యులర్ యాక్టివిటీస్‌లో ఇప్పుడు ఏఐ, మెషీన్ లెర్నింగ్, కోడింగ్ ప్రధాన ప్రాధాన్యతలుగా ఉన్నాయి. ఈ తరగతులు సమ్మర్ క్యాంప్స్‌నకే పరిమితం కాకుండా ఏడాదంతా ఒక సబ్జెక్ట్‌గా జరుగుతున్నాయి. ప్రముఖ కార్పొరేట్ పాఠశాలల్లో చదివే ఎంతోమంది విద్యార్థులు వీటిని ఎంచుకుంటున్నట్టు చెబుతున్నారు. దాంతో పాఠశాలలు కూడా ఈ సబ్జెక్టులను చెప్పిస్తున్నాయి. ఆసక్తికర అంశం ఏంటంటే.. వారంలో ఒక రోజు.. అది కూడా 1%-%2 గంటలు క్లాస్ చెప్పే ఏఐ నిపుణుడికి పాఠశాలలు నెలకు రూ.70,000 వరకు చెల్లిస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సబ్జెక్టులకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే విద్యార్థులు చాట్ జీపీటీ సాయం తీసుకుంటున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో కొందరు వెబ్‌సైట్ డిజైనింగ్ కూడా చేస్తున్నారు.

# పొగచూరుతున్న బతుకులు




సిగరెట్లు, బీడీలు, హుక్కా పైపులు, గుట్కాలు, నసెం పొడులు, జర్దా, ఖైనీ, స్మోక్‌లెస్ టొబాకో లాంటి పలు రకాలైన పొగాకు ఉత్పత్తులు పలు ఆకర్షణీయ రూపాల్లో మనల్ని వశపరుచుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. వీటికి తోడుగా పొగరాయుళ్లతో తిరిగే స్నేహితులు, బంధువులు కూడా సెకండ్ హాండ్ స్మోకర్స్‌గా తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. అవగాహనలేమి లేదా తెలిసి కూడా పొగాకు ఉత్పత్తుల వాడకంతో నిండు ప్రాణాలు ప్రమాదంలో పడడం, చివరికి వైద్య ఖర్చులకు కుటుంబాలు బజారున పడడం, ప్రాణాలు కూడా పోవడం చూస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు దురలవాటుతో సాలీనా 8.7 మిలియన్ల మంది ప్రాణాలు పోతున్నాయని, అనేక మిలియన్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని గణాంక వివరాలు స్పష్టం చేస్తున్నాయి. పొగాకు రహిత సమాజ స్థాపన జరగాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కృషి చేయడం సముచితంగా ఉంది.

### అనైతిక ప్రచార విష వలయంలో పడొద్దు

1988లో ఐరాస - డబ్ల్యూహెచ్‌ఓ చొరవతో పొగాకు దుష్ప్రభావాలను సామాన్య ప్రజలకు అవగా హన పర్చడంతో పాటు ఆ ఉత్పత్తుల వలలో పడకుండా హెచ్చరించడానికి ప్రతి యేటా 31 మేన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పాటించటం ఆనవాయితీ గా మారింది. ఈ ఏడాది ఇతివృత్తంగా "అన్‌మాస్కింగ్ ది అప్పీల్ (పొగాకు కంపెనీల విజ్ఞప్తుల గుట్టు విప్పడం)" అనే అంశంపై ప్రచారం చేస్తున్నారు. పొగాకు ఉత్పత్తు లను తయారు చేసే కంపెనీలు సువాసనలను వెదజల్లేం దుకు ఉపయోగించే పదార్థాలు, మార్కెటింగ్ విధానాల్లో అనైతిక పద్ధతులు, ఆకర్షణీయ ప్యాకేజీలు, ప్రముఖులతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం వంటి పోకడలను వ్యతిరేకిస్తున్నది. పొగాకు పరిశ్రమలు గుప్పించే ప్రకట నల విషవలయంలో 37 మిలియన్ల మందికి పైగా 13-15 ఏండ్ల పిల్లలు చిక్కుకుపోతున్నారు. పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల పరిశ్రమలు దాదాపు 16,000 రకాల సువాసన కలిగిన రసాయన పదార్థాలను కలుపుతున్నట్టు వెల్లడైంది.

### పొగాకు ఉత్పత్తుల వాడకం - దుష్ప్రభావాలు

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.3 బిలియన్ల మంది ప్రజలు పొగాకు ఉత్పత్తుల దురలవాటుకు లోనైనట్టు, భారత్‌లో 15 ఏండ్ల పైబడిన 25.3 కోట్ల మంది ప్రజలు (పురుషులు, మహిళలు) ఈ దురలవాటు గుప్పిట్లో చిక్కుకుపోయినట్టు అంచనా. ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తులు వాడడంలో రెండవ స్థానంలో నిలుస్తున్న భారత్‌లో సెకండ్ హాండ్ స్మోకింగ్ కూడా అధికంగా ఉందని హెచ్చరిస్తున్నారు. పొగాకు వాడకం అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే 80శాతం వరకు ఉందని గమనించాల్సిన విషయం. భారత్‌లో అత్యంత ప్రమాద కర ప్రజారోగ్య సమస్యల్లో పొగాకు వాడకం 5వ స్థానా న్ని ఆక్రమించింది. ఈ అలవాటుతో 18 శాతం హృద్రోగ మరణాలు, 14 శాతం స్ట్రోక్‌లు, 60 శాతం ఊపిరితి త్తుల క్యాన్సర్ కారక మరణాలు నమోదవుతున్నాయి. పొగాకు వాడినపుడు విడుదలయ్యే పొగలో వేలకొద్ది రసాయనాలు విడుదలవుతున్నాయని తెలుసుకోవాలి. ఈ అలవాటు దీర్ఘకాలం కొనసాగితే ఊపిరితిత్తులు, నోరు, గొంతు, కాలేయం, మూత్ర పిండాలు, క్లోమం, గర్భాశయ, పెద్ద ప్రేగు క్యాన్సర్లకు దారి తీయడంతో పాటు ప్రాణాలను సహితం కోల్పోయే పరిస్థితులు ఏర్పడతాయి. పొగాకు ఉత్పత్తుల వాడకంతో ఊపిరితి త్తులు, గుండె, మధుమేహం, టిబీ, కంటి జబ్బులు, స్ట్రోక్ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడుతున్నారు. గర్భవతులు పొగాకు వాడితే పిల్లల్లో తక్కువ బరువు, ముందస్తు ప్రసవాలు, శిశు అభివృద్ధి మందగించడం వంటివి చోటుచేసుకుంటాయి. పొగాకులో ఉండే నికోటిన్ ప్రభావంతో ప్రాణాంతక పరిస్థితులు వస్తాయి. పొగాకు ఉత్పత్తుల దురలవాటును తగ్గించేందుకు అనేక నియమనిబంధనలు, ప్రమాదరక సువాసనలిచ్చే పదార్థాల వినియోగాన్ని నిషేధించడం, నికోటిన్ ఉత్ప త్తులు వాడకపోవడం వంటి చర్యలను తీసుకోవాలని డబ్ల్యూహెచ్‌ఓ ప్రపంచ దేశాలకు సూచిస్తున్నది. పొగాకు ఉత్పత్తుల అనైతిక మార్కెటింగ్ సరళిని అడ్డుకోవడం, పన్నులను పెంచడం, పొగ రహిత వాతావరణాన్ని నెలకొల్పడం నిరంతరం జరగాలి. ప్రభుత్వాలు, విద్యా వేత్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పౌర సమాజం సమైక్యంగా కలిసి పోరాడితే పొగాకు రహిత సమాజ స్థాపన సుసాధ్యమని తెలుసుకోవాలి. ఆరోగ్యంగా జీవించడం ఓ మానవ హక్కు అని తెలుసుకొని, పొగా కుకు దూరంగా ఉందాం. సంపూర్ణ ఆరోగ్యకర సమాజా నికి దగ్గరగా జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. పొగాకు రహిత సమాజాన్ని స్థాపించుకుందాం.

# అవార్డులూ అవమానాలూ




"విడుస్తున్న పొద్దు మీద గడుస్తున్న జాలమా పేరు పురస్కారమా!" అంటూ వ్యంగ్య కవితోక్తిని విసిరాడు ఘకూర్ కవి. నిజంగానే అవార్డుల పేరుతో ఆ పేరును అవమానిస్తున్నారు కదా! అనే భావం కలుగుతున్నది. గాంధీ పేరును బ్రాందీ షాపునకు పెట్టుకున్నట్లుగా కనపడుతున్నది. ఒక వ్యక్తిని గౌరవించడమంటే అతని వ్యక్తిత్వాన్నీ, ఆలోచనను, ఆశయాన్నీ గౌరవించడమే, కానీ కేవలం పేరును కాదు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరున సినిమాలకు, నటులకు, కళాకారులకు అవార్డులు ప్రకటించింది. దీనిపై అనేక రకాల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు సినిమా వాళ్లకు పురస్కారాలివ్వడానికి గద్దర్ పేరును వాడుకోవడమే కాంట్రాస్ట్‌గా ఉన్నది. ఇప్పుడు విమర్శలు రావడానికి అదేకారణం. ఎందుకంటే గద్దర్ అనగానే మనకు సినిమా గుర్తురాదు. సినిమా నటులూ గుర్తుకురారు. పంచెకట్టి, గొంగడి భుజానేసుకుని ప్రజల బాధలను, గాథలను గానం చేస్తున్న రూపం, చైతన్యాన్ని రేకెత్తిస్తున్న పాట గుర్తుకొస్తాయి. మరీ ముఖ్యంగా ఆధిపత్యాన్ని ధిక్కరించే గొంతుక ధ్వని వినిపిస్తుంది. గద్దర్ పేరు సమకూర్చుకున్న అర్థం అది. అంతేకాని ఆయనను ఇంకో రకంగా ఊహించలేము. గద్దరు సినిమాలో నటించాడు. అందులోనూ జనగానమే చేశాడు. "బండెనక బండికట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లో వస్తవు కొడుకో, నైజాము సర్కరోడా'%ా% అని మాభూమి సినిమాలో గద్దరు గొంతుక, నటన నాటి జమీందారుల, దేశముఖ్‌లపై పేలుతున్న గీతంలా కనపడతాడు. అట్లాంటి గద్దర్ పేరు మీద ఇచ్చే అవార్డు, నాటి సాయుధ తెలంగాణ పోరాటాన్ని వక్రీకరించి, మత విద్వేషంతో జరిగిన పోరాటంగా చూపిన 'రజాకార్' చిత్రానికి చరిత్ర వారసత్వ అవార్డుగా ప్రకటించడం ప్రజా సాంస్కృతిక రంగంలో ఉన్న ప్రతివారికీ అనుచిత నిర్ణయమని ఆగ్రహం తెప్పిస్తున్నది. గద్దర్ బతికున్నపుడు రాహుల్ గాంధీని కలవడానికి కారణం, దేశంలో మతతత్వ శక్తులను ఎదుర్కొనేందుకు మరింత బలమైన ఉద్యమాలకు పూనుకోవాలన్న ఉద్దేశ్యమే అందులో ఉంది. కానీ ఈ సినిమా మత విద్వేషాన్ని పెంచేలా తీసారు. చరిత్రను వక్రీకరించిన సినిమాకు గద్దర్ పేరుతో అవార్డు ఇవ్వడం గద్దర్ ఆశయాలకే అవమానకరమని, ప్రభుత్వానికీ అప్రతిష్టకరమని ప్రజా సాంస్కృతిక కేంద్రం ప్రకటించింది. అసలు ఈ అవార్డులు, ముఖ్యంగా ప్రభుత్వాలు ఇచ్చే అవార్డులు ఆయన పేరు మీద ఇవ్వటం సరి అయినదేనా? గతంలో గద్దర్ పాడిన 'నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా' పాటకు, 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా' పాటకూ నంది అవార్డులొస్తే, నా ఆదర్శాలకు ఈ అవార్డులు వ్యతిరేకమని తిరస్కరించి తీసుకోలేదు. ఇక గద్దర్ అవార్డులు పొందిన నటులు, దర్శకులు, నిర్మాతలు ఎవరైనా కానీ కలెక్షన్లు, ఆదాయాలు, లాభాలు తప్ప, గద్దర్ కళా దృష్టి ఈషన్మాత్రమూ లేనివాళ్లే. గద్దర్ పేర ఇస్తున్నపుడు కనీసంగా, కుటుంబ కథా చిత్రాలు, సామాజిక ప్రయోజనం కలిగిన చిత్రాలకు ఇస్తామన్న ఒక గిరిగీతన్నా ఉంటే బాగుండేది. ఏ మాత్రం సామాజిక ప్రయోజనం లేని కల్కి సినిమా, స్మగ్లర్ పుష్పరాజ్ నటనకు రావటం గద్దర్ అభిమానులకు సహించడం లేదు. ప్రజా కవి గద్దర్ ఆలోచనలు, ఆయన ఆచరణకు నేటి సినిమాలు పూర్తి భిన్నమైనవి. వ్యతిరేకం కూడా. ఆయనపై అభిమానాన్ని చాటుకోవాలంటే ఆ పేరుతో ఒక జానపద పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. లేదా ప్రజా కళలను, జయధీర్ గారు చేస్తున్న ఆద్య కళల అభివృద్ధికి ఒక సంస్థను ఏర్పాటు చేయవచ్చు. ప్రజా కళలను నిర్వహిస్తున్న వారికి గద్దర్ పేరున పురస్కారాలూ ఇవ్వవచ్చు. అంతేకాని ఆ పేరుకు వెనకున్న ఆలోచనను తిరస్కరించే మినహాయించే పని చేస్తే అవమానించినట్లే అవుతుంది కదా! అయితే జ్యూరీ ప్రకటించిన అన్ని సినిమాలూ, నటులూ అర్హమైనవి కావు అని అనటం లేదు. కొన్ని మంచివి కూడా ఉన్నాయి. కానీ చెడు ఎక్కువ ప్రభావితం చేస్తుంది. నిజానికి తక్కువ బడ్జెట్‌లో తీసే చిత్రాలు, చిన్న సినిమాలే మంచి సినిమాలుగా ఉన్నాయి. అట్లాంటి వాటిని ప్రోత్సహించడం కూడా చేయాలి. ప్రజాకవి కాళోజీపై తీసిన చిత్రానికి థియేటర్లే దొరకలేదు. దానికి ఈ అవార్డులు వచ్చిన భారీ బడ్జెట్ చిత్రాలే కారణం. కాబట్టి చిన్న చిత్రాలకు థియేటర్లను ఇవ్వట పెద్ద ప్రోత్సాహకమే అవుతుంది. అధికారమే పరమావధిగా పని చేస్తున్న రాజకీయాలకు, స్వార్థ రాజకీయ నాయకులకు ప్రజా కళాకారులను, కళలను, వారి అవసరార్థమై వాడుకోవడమే తప్ప, వారి ఆలోచనలను, ఆశయాలను గౌరవించదు అనే దానికి ఇదో ఉదాహరణ. ఉద్యమ కళాకారుల్ని సాంస్కృతిక సారథి పేర ఉద్యోగులుగా మార్చి తమ రాజకీయ ప్రచారానికి వాడుకున్నది. ప్రజా కళాకారులను ఆదుకోవాలి తప్ప అదుపులో ఉంచుకోవాలనుకోవటం తగదు. అందుకని ఇప్పటికైనా ప్రభుత్వం అవార్డుల జ్యూరీ కమిటీకి కొన్ని నియమాలతో మార్గనిర్దేశనం చేయాలి. ప్రజా కళాకారుల గౌరవాన్ని ఇనుమడింపచేయాలి.

ప్రభాత సూర్యుడు

సంపాదకీయం

# ప్రగతికి కులవ్యవస్థే అడ్డుగోడ

## (విశ్లేషణ)

'ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి ఎక్కడైతే కొన్ని హక్కులు అనుభవిస్తున్నారో అక్కడి నుంచి వారిని తొలగించే ప్రయత్నం జరుగుతున్నది. అందులో భాగంగానే పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారు. దీనిని కేవలం ప్రైవేటైజేషన్ అనుకోవద్దు. ఇది డీ దళత్ ఫికేషన్, డీ ఒబిసి ఫికేషన్ అనాలి. ఎందుకంటే ఆయా వర్గాలను అవకాశాల నుంచి దూరం చేస్తున్నారు" అని కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, రాహుల్ గాంధీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. గత నాలుగు రోజుల క్రితం ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థులతో అదే క్యాంపస్‌లో కలుసుకొని మాట్లాడుతూ, "మీరు ప్రతి చోటా భాగస్వామ్యం గురించి, అవకాశాల గురించి మాట్లాడుతున్నారు. వాటిని కల్పించే అధికారం గురించి మాట్లాడాలి. కేవలం అవకాశాల గురించి ఆలోచిస్తే ప్రయాజనం లేదు. ఉదాహరణకు విద్యార్థులుగా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు చాలా మంది ఉన్నారు. కానీ ప్రొఫెసర్లలో ఎవ్వరూ లేరని మీరే చెబుతున్నారు. అటువంటిప్పుడు మీరు సరైన మార్గదర్శకత్వం పొందలేరు" అని తన సమాధానంలో రాహుల్ చెప్పారు. ఈ సంభాషణ ఇప్పుడు చాలా చోట్ల చర్చనీయాంశంగా మారింది. అదే విధంగా మరొక విషయాన్ని రాహుల్‌గాంధీ, ప్రత్యేకంగా పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక వనరులున్న రంగాలు ముఖ్యంగా కార్పొరేట్లు, కాంట్రాక్టు పనుల కేవలం కొన్ని సెక్షన్ల చేతుల్లో ఉన్నాయని, ఈ విషయం లెక్కలతో సహా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో తేలిందని కూడా ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు ఎస్‌సి, ఎస్‌టి ఒబిసిలకు అవకాశాలను అందకుండా చేయడం, నిర్ణయాధికారం కలిగిన పదవుల్లో, హోదాల్లో వారికి స్థానం కల్పించకపోవడం వల్ల ఈ వర్గాలు రోజురోజుకు ఇంకా ఇంకా దిగజారిపోతున్నాయి. ఇది వాస్తవం. ముఖ్యంగా జ్ఞానానికి, ఆర్థిక రాజకీయ అధికారానికి దూరంగా ఉంచే ప్రక్రియ గత రెండు వేల ఏళ్ళుగా కొనసాగుతున్నది. భారతదేశ చరిత్రను మనం చాలా సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే ఈ విషయాలు మనం అర్థం కాగలవు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా రాజ్యం ఏలుతున్నది కుల వ్యవస్థ రక్షకులు మాత్రమే. తాము ఏ స్థానంలో ఉన్నామో ఆ స్థానాలనకు ప్రమాదం వాటిల్లకుండా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. మనువాదం అనేది నాటికి, నేటికీ ఆధిపత్యంలోనే ఉన్నది. కొంత మంది మేధావులు మనుధర్మాన్ని మానవ ధర్మంలో రాజనీతి, ఆర్థిక శాస్త్రంగా పేర్కొంటూ, దానిని విమర్శించిన వాళ్ళ మీద మూకుమ్మడి దాడులు చేస్తున్నారు. కొన్ని సార్లు భౌతికంగా కూడా దాడులకు పాల్పడుతున్నారు. అయితే ఇప్పుడు ఆర్థిక వనరులకు, జ్ఞాన సముపార్జనకు, రాజకీయ హక్కుగా అవకాశం కల్పిస్తున్న భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. మనుధర్మంలో ఆ రోజు అంటరాని కులంగా చెప్పుకున్న చంఢాల జాతికి పెట్టిన ఆంక్షలను పరిశీలిస్తే మనకు ఈ కుల వ్యవస్థ వేదాలు ప్రబోధించే వర్ణవ్యవస్థ ఈనాటికి మరొక రూపంలో ఉనికిలోనే ఉన్నది. 'చంఢాల, స్వపక జాతులు ఊరి బయటనే ఉండాలి. చనిపోయిన జంతువుల మాంసాన్నే తినాలి. శవాల మీద వస్త్రాల ధరించాలి. వీరిని ఎవరూ తాకకూడదు. ఎటువంటి ఇళ్ళు, జాగా ఉండడానికి లేదు. శ్మశానాలలోనే నివసించాలి" ఇది చాలా స్పష్టంగా మనుస్మృతిలో పేర్కొన్నారు. అంటే ఒక రకంగా వీరికి ఎటువంటి జ్ఞానం, వనరులు ఉండడానికి వీలు లేదు. శూద్రులు విషయానికొస్తే, వీళ్ళు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలకు సేవ చేయడమే వీరి పరమావధి. చదువు, ఇతర విశ్వ విజ్ఞానం వీరు నేర్చుకోకూడదు. వీరికి ఎవ్వరూ బోధించకూడదు. ఇందులో వృత్తి పని వారి సేవలుంటాయి. వారి శ్రమతో మిగతా మూడు కులాలను సేవించాలి. నైపుణ్యం కలిగిన వృత్తి పని వారు ఉన్నప్పటికీ, వాటి ఆదాయ వనరుల మీద వారికి అంతగా హక్కులుండవు. అదే నేటికీ కొనసాగుతున్నది. ముఖ్యంగా భూమి, ఆర్థిక వనరులు వీరికి అందాల్సిన స్థాయిలో అందడం లేదు. ముఖ్యంగా దళితుల విషయానికొస్తే, పురాతన కాలం నుంచి ఎన్నో నిషేధాలు, ఆంక్షలు ఎదుర్కొనప్పటికీ, వాటిని అధిగమించి జీవిస్తూ ఈ సమాజాభివృద్ధికి పాటు పడుతూనే ఉన్నారు. భూమిని సాగు యోగ్యంగా చేసి, నీటి వనరులను సృష్టించి, వాటిని నిర్వహించి వ్యవసాయానికి తమ రక్తాన్ని, చెమటను అందించిన దళితులు ఇప్పటికీ భూమిని హక్కుగా పొందలేకపోతున్నారు. ఇప్పటికే ఉన్న భూములను కోల్పోతున్నారు. అంతేకాకుండా సమాజంలో సమాన హక్కులు ఉండాలని ఎన్నో ఏళ్లు ఎంతో మంది పోరాడి ఒక మార్గానికివస్తే ఆ హక్కు అందుకుందామంటే, అవి నిరుపయోగంగా ఉన్నాయి. రాహుల్ గాంధీ చెప్పినట్టు ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు ఏ అవకాశాలను అందుకుందామని వస్తే అవి నిరుపయోగం అవుతున్నాయి. కొన్నికులాలు వీళ్లతో భాగస్వామ్యం పంచుకోలేక మరో ప్రపంచాన్ని సృష్టించుకుంటున్నారు. ఉదాహరణకు, **1950** రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత చట్టపరంగా అందరికీ ఒకే బడిలో చదువుకునే అవకాశం వచ్చింది. అయితే అది ఎంతో కాలం సాగలేదు. ఇరవై సంవత్సరాలు దాటిన తర్వాత ప్రభుత్వం నిర్వహించే పాఠశాలలు, కళాశాలల నుంచి వెళ్లిపోయి తమ కోసమేనన్నట్టుగా ప్రైవేటు విద్యా వ్యవస్థలను నెలకొల్పుకున్నారు. సర్కారు విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, కొన్ని బిసి కులాల పిల్లలకు పరిమితమయ్యాయి. ఒకనాడు విశ్వవిద్యాలయాలు అన్ని కులాల విద్యార్థులు చదువుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వం నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయాలు ఎస్‌సి, ఎస్‌టి, కొన్ని బిసి కులాలకే పరిమితం. సర్కారు విశ్వ విద్యాలయాలు నిధులు, సిబ్బంది, ఆధునిక వసతులు ఉండవు. ఆధిపత్య కులాలు చదువుకునే ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో అత్యాధునిక వసతులు ఉంటాయి. అదే విధంగా స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో అందరూ ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లేవారు. అప్పుడు అవి సమర్థవంతంగా పని చేసేవి. అక్కడికి కింద కులాలవాళ్లు, తక్కువ కులాల వాళ్లు రావడం మొదలై వాళ్లు పడుకునే మంచాల మీద తాము పడుకోవడం నీచమని భావించి ప్రైవేటు వైద్య వ్యవస్థను తీసుకొచ్చారు. దానితో ప్రభుత్వ వైద్యశాలలు పనికి రాకుండా పోయాయి. ఈగలు, దోమలు, పనికిరాని పరికరాలు, పని చేయని వైద్యుల స్థావరాలుగా మారిపోయాయి. అదే విధంగా పబ్లిక్ రంగ సంస్థలు. ఎంతో కొంత చదువుకొని ఉద్యోగాలకు వస్తే **1970** ప్రాంతం వరకు అన్ని ప్రైవేటు పరిశ్రమలే. **1970** తర్వాత అప్పటి ప్రధాన మంత్రి చాలా రంగాల్లో పబ్లిక్ రంగ సంస్థలను నెలకొల్పింది. అందులో రిజర్వేషన్లు ఉండడం వల్ల ఎస్‌సి, ఎస్‌టిలు ఉద్యోగాలు పొందారు. కాని ఆ సంబరం ఎక్కువ కాలం లేదు. **1970** తర్వాత ఆర్థిక సంక్షోభం పేరు చెప్పి ప్రైవేటు రంగానికి గేట్లు తెరిచారు. **2000** సంవత్సరం తర్వాత పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వేగం పెంచారు. ఇప్పుడు అది మొత్తం పబ్లిక్ రంగ సంస్థ అనే పదం లేకుండా చేస్తునానరు. దీనితో తేలేదేమిటంటే, కుల వ్యవస్థ ప్రతిపాదించిన నిచ్చెన మెట్ల వ్యవస్థ అదే గ్రేడింగ్‌ను కొనసాగిస్తున్నది. సమాజంలో ఉన్న చట్టాలు, రాజ్యాంగ హక్కులు అన్ని కుల వ్యవస్థ శక్తి ముందు, మనుస్మృతి ప్రభావం ముందు దూదిపింజల్లా తేలిపోతున్నాయి. అందుకే బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్టు ఈ దేశంలో కుల వ్యవస్థను నిర్మూలించకుండా ఎటువంటి ప్రగతి అనుకున్న స్థాయిలో సాధించలేమని తేలుతున్నది.

# దక్షిణాదికి పాకిన జ్యోతి లీలలు! ముఖ్యమంత్రి మేనల్లుడికి జ్యోతితో ఏంటి సంబంధం?




యూట్యూబ్ వీడియోల పేరిట.. సోషల్ మీడియాలో భారీ క్రేజ్ సంపాదించుకున్న జ్యోతి మల్హోత్రా.. ఆ ముసుగులో దేశద్రోహానికి పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఆమెను దర్యాప్తు సంస్థలు విచారిస్తున్నాయి. పాక్ నిఘా సంస్థలకు.. దేశానికి సంబంధించిన కీలక సమాచారాన్ని అందిస్తున్నారన్న ఆరోపణలతో అరెస్టయిన జ్యోతి మల్హోత్రా.. కేవలం ఉత్తరాదిలోనే కాదు, దక్షిణాదిలోనూ తన నెట్‌వర్క్ కలిగి ఉన్నారనే ముచ్చట లేటెస్టుగా వెలుగుచూసింది. ఆమె కేరళ పర్యటనపై ఆ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ మాజీ అధ్యక్షుడు కె.సురేంద్రన్ చేసిన ఆరోపణలే దీనికి బలం చేకూరుస్తోంది. ఈ వ్యవహారం అటు తిరిగి, ఇటు తిరిగి.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కాంపౌండ్ దగ్గరకు చేరడం.. చర్చనీయాంశంగా మారింది. సీఎం పినరయి దగ్గర బంధువులకు.. జ్యోతితో సంబంధాలున్నాయనే మాట.. రాజకీయవర్గాల్లో కలకలం రేపుతోంది. సోషల్ మీడియాలో కేరళ బీజేపీ నాయకుడు కె. సురేంద్రన్ చేసిన పోస్టు.. ఇప్పుడు సంచలనంగా మారింది. కేరళ సీఎం పినరయి విజయన్ మేనల్లుడు, రియాస్ నేతృత్వంలోని కేరళ పర్యాటక శాఖ పాకిస్థాన్ గూఢచారి జ్యోతి మల్హోత్రా కన్నూర్ పర్యటనకు స్పాన్సర్ చేసిందన్నది ఆయన పోస్టు సారాంశం. ఈ పర్యటనలో ఆమె ఎవరిని కలిసింది? ఎక్కడికి వెళ్లింది? అసలు ఆమె అజెండా ఏంటి? పాక్‌తో సంబంధాలు ఉన్న వ్యక్తికి కేరళలో రెడ్ కార్పెట్ ఎందుకు వేశారు?' అని సురేంద్రన్ ఎక్స్ వేదికగా ప్రశ్నించడం దుమారం రేపుతోంది. సాధారణంగానే కేరళ మంచి పర్యాటక ప్రదేశం. విత్ పర్మిషన్ అక్కడ ఎవరు పర్యటించినా అభ్యంతరం లేదు. కానీ, దాదాపుగా దేశద్రోహం ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్యోతి మల్హోత్రా లాంటివారు.. కేరళకు ఎందుకు వెళ్లారన్నదే ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. అందులోనూ, ఆమెకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి మహ్మద్ రియాజ్ స్పాన్సర్ చేయడం%ళ% మరింత హాట్ న్యూస్‌గా మారింది. ఆయన సీఎం విజయన్‌కు మేనల్లుడు కావడంతో.. వివాదం ముదిరింది. ఈ వ్యవహారంలో.. అక్కడి ప్రభుత్వంపై ప్రశ్నలు సంధిస్తోంది బీజేపీ. జ్యోతి మల్హోత్రాపై బీజేపీ కేరళ మాజీ అధ్యక్షుడు చేసిన సంచలన ఆరోపణలు.. ఇప్పుడు దక్షిణాదిలో కొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సౌత్‌లోనూ స్పై జ్యోతి నెట్‌వర్క్ ఉండొచ్చన్న అనుమానాలు మొదలయ్యాయి. ఈ పాకిస్తాన్ గూఢచారికి సౌత్‌లో ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నాయి నిఘా సంస్థలు. ఏకంగా సీఎం అల్లుడు, రాష్ట్ర పర్యాటక మంత్రి మహమ్మద్ రియాస్ స్వయంగా.. పర్యాటక శాఖ నిధుల నుంచే అమె టూర్‌కు స్పాన్సర్ చేశారనే ముచ్చట సంచలనం సృష్టిస్తోంది. దీంతో దక్షిణాదిలోనూ ఆమె నెట్‌వర్క్ మామూలుగా లేదన్న ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో విచారణ బృందాలు సైలెంట్‌గా కూపీలాగుతున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే.. జ్యోతికి సంబంధించి మరిన్ని సంచలన విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. తీగ లాగితే డొంక కదిలినట్టు.. ఇటీవల జ్యోతి కథలు ఒడిశాలోనూ బయటకు వచ్చాయి. అక్కడి పూరి ఆలయంతో పాటు ప్రపంచ ప్రఖ్యాత కోణార్క్ ఆలయాన్ని కూడా ఆమె సందర్శించినట్లు పూరి క్రైమ్? బ్రాంచ్? నిర్ధారించింది. ఒడిశాకు చెందిన యూట్యూబర్ ప్రియాంక సహబిని విచారించగా ఈ విషయం వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. ప్రియాంక-జ్యోతిని పూరి, చిలికా, కోణార్క్‌కు తీసుకెళ్లినట్టు క్రైమ్ బ్రాంచ్ అధికారులు స్పష్టం చేశారు. ఇప్పుడు వీరిద్దరూ తీసిన వీడియో ఫుటేజీపైనే దర్యాప్తు కొనసాగుతోంది. అసలు జ్యోతి-ప్రియాంక ల మధ్య సంబంధం ఏంటీ? ట్రావెల్ టికెట్లు ఎలా కొనుగోలు చేశారు? వారికి మరెవరితోనైనా సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో విచారణ జరుగుతోంది. వారిద్దరూ కలిసి తిరిగిన ప్రదేశాలన్నింటికీ.. ప్రత్యేక దర్యాప్తు బృందాలు వెళ్లినట్టు తెలుస్తోంది. ఇప్పటికే జ్యోతి వ్యవహారంలో కీలక విషయాలు వెలుగు చూశాయి. ట్రావెల్ విత్ జో పేరిట యూట్యూబ్ చానెల్ నిర్వహిస్తున్న ఆమె.. 2023లో పాకిస్తాన్ పర్యటనకు వెళ్లినప్పుడు.. అక్కడి హైకమిషన్ ఉద్యోగి డానిష్‌ను పరిచయం చేసుకుంది. ఆ తర్వాత పాక్ గూఢచర్య సంస్థల ప్రతినిధులతోనూ ఆమె సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలోనూ జ్యోతి.. డానిష్‌తో టచ్‌లో ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలతోనే ఆమెను అరెస్టు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు. ఆమెకు ఉగ్రవాదులతో సంబంధం ఉన్నట్లు, ఉగ్ర కార్యకలాపాల్లో పాలుపంచుకున్నట్లు ఆరోపణలు రావడంతో.. ఆ దిశగానూ విచారణ జరుపుతున్నారు. ఇదే కేసులో ఇటీవల పాకిస్థాన్ నిఘా సంస్థ ఏజెంట్లకు భారతీయ మొబైల్ సిమ్‌కార్డులు సరఫరా చేస్తున్న ఖాసిం అనే వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. పాక్‌కు గూఢచర్యం చేసిన ఆరోపణలపై ఖాసిం సోదరుడు హసిన్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. కొత్తగా దక్షిణాదిలోనూ జ్యోతి లింకులు బయటపడటంతో.. ఈ వ్యవహారంలో ఇంకెన్ని కొత్త కోణాలు బయటకు వస్తాయోనన్న ఆసక్తి ఏర్పడింది.

# టీబీజేపీ నూతన అధ్యక్షుడు ఎవరు? కీలక వర్క్‌షాప్.. బండి సంజయ్ ఏమన్నారంటే..



తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడి నియామకం కమలం పార్టీ చాలెంజ్‌గా మారింది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ఇవాళ హైదరాబాద్ వేదికగా జరగబోతోన్న తెలంగాణ బీజేపీ వర్క్‌షాప్ ఆసక్తి రేపుతోంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని బీజేపీ ఆఫీస్‌లో కీలక వర్క్‌షాప్ నిర్వహించబోతోంది. ఈ సమావేశానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌లు అభయ్‌పాటిల్, చంద్రశేఖర్ తివారీ హాజరుకానున్నారు. కేంద్రమంత్రులు, తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు.. రాష్ట్ర పార్టీ నేతలు, జిల్లా అధ్యక్షులు పాల్గొంటారు. ఈ సందర్భంగా.. తెలంగాణలోని తాజా రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. మోదీ 3.0 ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను జనంలో తీసుకువెళ్లడం, అంతర్జాతీయ యోగా డే, ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వాహణపై ఫోకస్ చేస్తారు. పార్టీ భవిష్యత్ కార్యచరణ ప్రణాళికపై దృష్టి సారించనున్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి దిశానిర్దేశం చేస్తారు. పార్టీ వేదికల్లో నేతలు మాట్లాడాల్సిన తీరుపై నేషనల్ లీడర్స్ సూచనలు చేసే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంపైనా రూట్ మ్యాప్ ప్రకటించనున్నట్లు బీజేపీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఈ సమావేశానికి నేతలంతా ఖచ్చితంగా హాజరు కావాలని బీజేపీ తెలంగాణ నాయకత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంటోంది. మరోవైపు.. హైదరాబాద్ ఆఫీసులో కీలక సమావేశం వేళ.. బీజేపీ తెలంగాణ నూతన అధ్యక్షుడి ఎంపిక వ్యవహారం మరోసారి తెరపైకి వస్తోంది. తెలంగాణ బీజేపీ న్యూ చీఫ్ ఎవరనే అంశం ఆసక్తిగా మారుతోంది. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిపై కన్నేసిన నేతలు.. అధిష్టానం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే.. ఇవాళ జరిగే కమలం పార్టీ వర్క్‌షాప్‌లో చర్చల తర్వాత టీ.బీజేపీ చీఫ్ ఎవరనేదానిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని కొందరు నేతలు చెప్తున్నారు. అతి త్వరలోనే టీ.బీజేపీ నూతన అధ్యక్షుడ్ని ప్రకటించే చాన్స్ ఉందంటుందంటున్నారు. ఈ అంశంపై కేంద్రమంత్రి బండి సంజయ్ రియాక్ట్ అయ్యారు. బీజేపీ తెలంగాణ నూతన అధ్యక్షుడి నియామకంపై అధినాయకత్వం నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. అయితే.. ఎవరో చెబితే హైకమాండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులను నియమించదని గుర్తు చేశారు. దీనికి సంబంధించి బీజేపీకి స్పష్టమైన విధానం ఉందని బండి సంజయ్ చెప్పారు. మొత్తంగా.. తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడు ఎంపిక వ్యవహారం చాలెంజ్‌గా మారింది. అధిష్టానం వైపు పలువురు కీలక నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఇవాళ జరిగే టీ.బీజేపీ కీలక వర్క్‌షాప్‌లో క్లారిటీ వస్తుందా?.. లేదా?.. అన్నది చూడాలి..

# రాహుల్ ప్రియాంకలను చూసి నేర్చుకోవాల్సిందే !



అన్నా చెల్లెలు అంటే వారే ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ ఇద్దరూ కూడా సోదర ప్రేమకు నిలువెత్తు నిదర్శనంగా కూడా ఉంటున్నారు. ఈ విషయంలో సోనియా గాంధీ చాలా లక్కీ అన్న వారూ ఉన్నారు. నిజానికి చూస్తే వారసత్వ రాజకీయాలకు పెట్టింది పేరు గాంధీ కుటుంబం. అ ఆ కుటుంబంలో చూసుకుంటే తొలి తరంలో పండిట్ నెహ్రూ నాయకత్వ పగ్గాలు స్వీకరించారు. ఆయన తరువాత శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధాని అయ్యారు. ఆ తర్వాత వరసలో రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారు. ఇక అదే తీసుకుంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలి. కానీ ఒక జీవిత కాలం లేటు అన్నట్లుగా రాహుల్ కి ప్రధాని పదవి అందని పండు అవుతోంది. మరో వైపు చూస్తే రాహుల్ గాంధీకి ఒక చెల్లెలు ప్రియాంక ఉన్నారు. ఆమె కూడా రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు. పార్టీ మీద రాహుల్ కి ఎంత హక్కులు ఉన్నాయో తనకూ ఉన్నాయని ఆమె క్లెయిం చేయవచ్చు. కానీ ఆమె 2004 నుంచి పార్టీ ప్రచారానికే పరిమితం అయ్యారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత 2024లో వయనాడ్ లో లోక్ సభకు ఉప ఎన్నిక జరిగితే గెలిచారు. అది కూడా అన్న వదిలేసిన సీటుని. ఆ విధంగా చూస్తే ప్రియాంకను ఎంతగానో మెచ్చుకోవాలి. ఆమె అమ్మను అన్నను గెలిపించడం కోసమే గత రెండు దశాబ్దాలుగా తన రాజకీయాన్ని అంకితం చేశారు. నిజం చెప్పాలీ అంటే కీర్తి కాంత కనకం అని అంటారు ఎవరికి ఈ మూడింటి మీద వ్యామోహం ఉండదు, పైగా ప్రియాంక తన మామ్మ ఇందిరమ్మ పోలికలతో ఉంటారు, మంచి వాక్చాతుర్యం ఆమె సొంతం. ఆమె అన్ని అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉంటారు. ఎంత కష్టమైనా ఓర్చి ప్రజలకు సేవ చేయాలన్న తపన కూడా ఉంది. మరి ఇన్ని మంచి లక్షణాలు ఉన్నా ఆమె ఏనాడు అధికారాన్ని కోరుకోలేదు. అంతదాకా ఎందుకు 2004 నుంచి 2014 దాకా యూపీఅ వన్ టూ ప్రభుత్వాలు ఉన్నాయి. ఆ ప్రభుత్వాలలో రాహుల్ గాంధీ కనీసం మంత్రి కూడా కాలేదు, ఇక ప్రియాంక నాడే పేచీ పెడితే ఎంపీ అవడం కేంద్ర మంత్రి కావడం కష్టమేమీ కాదు. కానీ ఆమె అధికారానికి ఆవల నిలిచి ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజలలో ప్రచారం చేయడం గాంధీ వంశీకులకు పదవులు కాదు ప్రజల శ్రేయస్సు ముఖ్యమని చాటి చెప్పడమే లక్ష్యంగా అన్నా చెల్లెలు పనిచేస్తున్నారు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించి దేశం నలుగు చెరగులూ తిరిగారు. పాదయాత్ర చేసి తన నాయకత్వ పటిమను చాటారు. ఇక ప్రియాంకా గాంధీ చూస్తే కనుక ఉత్తర ప్రదేశ్ లో మహిళా సాధికారికత కోసం పనిచేస్తూ వస్తున్నారు. రాహుల్ గాంధీ తన చెల్లెలుకి ఎంపీ పదవి ఇచ్చేందుకు ఎంతో ఆప్యాయత చూపిస్తేనే ఆమె అందుకున్నారు. అలాగే అన్న రాహుల్ మేలునే ఆమె సదా కోరుకుంటున్నారు. ఇలా ఇద్దరూ పార్లమెంట్ లో ఎంపీలుగా ఉన్నారు. రాహుల్ లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నా తనకు మరే పదవీ ఆమె అడగలేదు. ఇలా జాతీయ రాజకీయాల్లో ఈ అన్నా చెల్లెలు మధ్య ఉన్న అనుబంధం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఎక్కడ బంధం అయినా డబ్బు అధికారం వద్ద బీటలు వారుతుంది. కానీ రాహుల్ ప్రియాంక దానికి అతీతం అని నిరూపించారు అంటున్నారు ఒకరి మేలు మరొకరు కోరుకుంటూ ఆదర్శమైన బంధాన్ని కొనసాగిస్తున్నారు. తెలుగు నాట చూస్తే వైఎస్సార్ ముద్దుల తనయ షర్మిల అన్న జగన్ నే 2024లో ఓడించడానికి తన సర్వ శక్తులూ ఉపయోగించారు. ఆమె ఈ రోజుకీ కాంగ్రెస్ తరఫున ఉంటూనే జగన్ రాజకీయ వినాశనాన్ని కోరుకుంటున్నారు. తనకు ఆస్తులతో పాటు రాజకీయ వాటా కావాలని పట్టుబడుతున్నారని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. అయితే జగన్ వైపు నుంచి చూసినా చెల్లెలుని ఎంత వరకూ సమాదరించారు అన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ఇక తెలంగాణాలో చూసుకుంటే బీఆర్ఎస్ మహిళా నేత కవిత తన సొంత అన్న కేటీఆర్ మీదనే బాణాలు ఎక్కు పెడుతున్నారు. ఇది కేసీఆర్ కి ఇబ్బందికరంగా ఉంది. ఒక వైపు కూతురు మరో వైపు కొడుకు. ఎవరూ తగ్గకుండా లాగితే పెద్దలకు కష్టమే అని అంటున్నారు. ఇవన్నీ కూడా అధికారం రాజకీయ ఆధిపత్యం కోసం వస్తున్న విభేదాలు అని అంటున్న వారూ ఉన్నారు. ఏది ఏమైనా కళ్ళ ముందే కనిపిస్తున్న రాహుల్ ప్రియాంకలను చూసి అయ్యా తెలుగు నాట అన్నా చెల్లెళ్ళు విభేదాలు మాని సామరస్యంగా ముందుకు అడుగులు వేస్తే మంచిదన్న సూచనలు వస్తున్నాయి.

# వేసవిలో ఏసీ లేదా కూలర్ ఏది ఆరోగ్యానికి మంచిది.. !!



: వేసవి కాలంలో చెమట, వేడి, తేమ నుంచి ఉపశమనం పొందడానికి కూలర్, %ాజ%ని వాడుతారు. ఏసీ నుండి వచ్చే గాలి శరీరానికి ఆహ్లాదకరమైన అనుభూతిని ఇస్తే, కూలర్ నుండి వచ్చే చల్లని గాలి, చల్లటి నీటి చిమ్మడంతో మనసులో ప్రశాంతత నింపుతుంది.ఈ రెండూ మండే వేడి నుండి ఒక వ్యక్తిని రక్షిస్తాయి కానీ ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి మంచిది? అనే డౌట్ చాలామందిలో ఉంటుంది. ఏసీ, కూలర్ ఏది సరైనదో కొన్ని విషయాలు ఈ ఆర్టికల్లో తెలుసుకుందాం.

కూలర్ మంచి ఎంపిక..

AC గాలి విషయానికి వస్తే.. మండే వేడి నుండి ఉపశమనం పొందడానికి ఇది అత్యంత వేగవంతమైన. సులభమైన మార్గం. ఏసీ గది నుండి వేడిని కొన్ని నిమిషాల్లోనే తొలగించగలదు. అయితే ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే.. అనేక విధాలుగా %ాజ% కంటే కూలర్ మంచి ఎంపిక అని నిపుణులు చెబుతున్నారు. కూలర్ గాలిలో తేమను నిలుపుకుంటుంది. తద్వారా చర్మం, శ్వాసకోశ పొడిబారడం తగ్గుతుంది. అయితే AC గాలిని పొడిగా చేయడం ద్వారా చర్మం, ముక్కు చికాకు కలిగిస్తుంది. ఏసీ గాలిలో ఎక్కువ సమయం గడపడం వల్ల చర్మం పొడిబారడం, కంటి చికాకు, డీహైడ్రేషన్, తలనొప్పి, అనేక శ్వాసకోశ ఆరోగ్య సమస్యలు వస్తాయి.

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా.. ఈ 5 చిట్కాలతో మీ ఇంట్లో నుంచి ఎలుకలు పరార్!

చల్లటి గాలిలో ఉండే ఆస్తమా, అలెర్జీ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ గాలి గొంతు, ఊపిరితిత్తులు ఎండిపోకుండా కాపాడుతుంది. అయితే ఏసీలోని చల్లని, పొడి గాలి శ్వాసకోశ సమస్యలను తీవ్రతరం చేస్తుంది. AC తో పోలిస్తే కూలర్ శరీరానికి తేలికపాటి చల్లదనాన్ని అందిస్తుంది. ఇది ఉష్ణోగ్రతలో ఆకస్మిక మార్పుల దుష్ప్రభావాల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. అయితే AC తక్కువ ఉష్ణోగ్రత వల్ల కీళ్ల నొప్పులు, జలుబు వస్తుంది. కూలర్ తక్కువ విద్యుత్తును వినియోగిస్తుంది. తద్వారా పర్యావరణంపై తక్కువ ప్రభావం చూపుతుంది. ఇది మానసిక ప్రశాంతతను ఇస్తుంది. ఇది పరోక్షంగా ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు గమనిక: ఈ కథనం ఇంటర్నెట్లో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా మాత్రమే ఇచ్చినది. దీనిని ధృవీకరించడం లేదు. ఆరోగ్య సమస్యల నివారణకు సంబంధిత వైద్య నిపుణుడిని సంప్రదించడం ఉత్తమం.




# డీమార్ట్ డిస్కౌంట్ల మర్మం.. తక్కువ ధరలకు నిత్యావసరాలు ఎలా అందిస్తోంది..?




: అత్యంత తక్కువ ధర లకు నిత్యావసరాలు మరియు ఇతర వస్తువులను విక్రయించే సంస్థల్లో డీమార్ట్ ముందు వరుసలో ఉంటుంది. భారీ డిస్కౌంట్లకు పేరుగాంచిన ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 400కు పైగా స్టోర్లు ఉన్నాయి. మిగతా రిటైల్ సంస్థల కంటే డీమార్ట్ తక్కువ ధరలకు వస్తువులు అందించడం ద్వారా వినియోగ దారులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇంతకీ, డీమార్ట్ ఈ స్థాయిలో డిస్కౌంట్లు ఇవ్వడానికి వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటో తెలుసా?

విజయవంతమైన వ్యాపారవేత్త ధమానీ వ్యూహం

స్టాక్ మార్కెట్‌లో విజయవంతమైన పెట్టుబడిదారుడిగా రాధాకిషన్ ధమానీ సుపరిచితులు. ఆయన స్థాపించిన డీమార్ట్ కూడా అదే స్థాయిలో విజయవంతంగా కొనసాగుతోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ సుపరిచితమైన పేరు డీమార్ట్. వారాంతాల్లో డీమార్ట్ స్టోర్లు జనంతో కిక్కిరిసిపోతుంటాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, డీమార్ట్ సాధారణంగా జనసాంద్రత తక్కువగా ఉండే ప్రాంతాల్లో తమ స్టోర్లను ఏర్పాటు చేస్తుంది. దీనివల్ల ఆ ప్రాంతాల్లో భూముల ధరలు మరియు అద్దెలు సహజంగానే పెరుగుతాయి. ఒకప్పుడు మెట్రో నగరాలకే పరిమితమైన డీమార్ట్ ఇప్పుడు టైర్-2 నగరాలకు కూడా విస్తరించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డీమార్ట్‌కు 415 స్టోర్లు ఉన్నాయి.

సొంత స్థలాలే విజయానికి మూలం

డీమార్ట్ తక్కువ ధరలకు వస్తువులు విక్రయించడానికి ప్రత్యేక గుర్తింపు పొందింది. అయితే, ఇంత భారీ స్థాయిలో డిస్కౌంట్లు ఇవ్వడం వెనుక రాధాకిషన్ ధమానీ ప్రత్యేకమైన వ్యాపార వ్యూహం ఉంది. డీమార్ట్ ఎక్కడా కూడా అద్దె స్థలంలో స్టోర్లను తెరవకపోవడమే దీనికి ప్రధాన కారణం. సొంత స్థలాల్లో స్టోర్లు ఉండటం వల్ల నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. అద్దె చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో, డీమార్ట్ తమ ఖర్చులలో 5-7 శాతం వరకు ఆదా చేస్తుంది. ఈ ఆదా చేసిన మొత్తాన్ని డిస్కౌంట్ల రూపంలో వినియోగదారులకు అందిస్తుంది. అంతేకాకుండా, డీమార్ట్ ఎల్లప్పుడూ కొత్త స్టాక్‌ను అందుబాటులో ఉంచడానికి ప్రాధాన్యత ఇస్తుంది. 30 రోజుల్లో సరుకులను విక్రయించి, కొత్త వస్తువులను ఆర్డర్ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తుంది. నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడం ద్వారా పొందిన ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించాలనే ఉద్దేశ్యంతోనే డీమార్ట్ భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తుంది. తక్కువ ధరల కారణంగా వినియోగదారులు డీమార్ట్ స్టోర్లకు పోటెత్తుతున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో స్టాక్ త్వరగా అయిపోతుంది. దీనివల్ల డీమార్ట్ తయారీ సంస్థలకు పెద్ద మొత్తంలో ఆర్డర్లు ఇస్తుంది.

దీంతో ఆయా సంస్థలు కూడా డీమార్ట్‌కు కొంత డిస్కౌంట్‌పై వస్తువులను సరఫరా చేస్తాయి. ఈ తగ్గింపును కూడా డీమార్ట్ ప్రజలకు డిస్కౌంట్ల రూపంలో అందిస్తుంది. ఇదే డీమార్ట్ విజయ రహస్యం!

# గ్రహాలు డ్యాన్స్ చేయడం అంటే ఇదేనేమో భయ్యా..




: మన సౌర కుటుంబంలో సూర్యుడితో పాటు తొమ్మిది గ్రహాలున్నాయి. అవి.. బుధుడు, శుక్రుడు, భూమి , అంగారకుడు, గురుడు , శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో. అయితే, 2006లో ఖగోళ శాస్త్రవేత్తలు ప్లూటోను గ్రహాల జాబితా నుంచి తొలిగించారు. ఇక ఈ గ్రహాలన్నీ తమ చుట్టూ తాము తిరుగుతూ.. గురుత్వాకర్షణ శక్తి కారణంగా సూర్యుడి చుట్టూ ఒక దీర్ఘవృత్తాకార కక్ష్యలో తిరుగుతాయి. అయితే, ఈ గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ ఒక కక్ష్య పూర్తి చేయడానికి వాటి దూరాన్ని బట్టి సమయం పడుతుంది. బుధుడు సూర్యుడి చుట్టూ ఒక రౌండ్ తిరగడానికి సుమారు 88 రోజులు పడుతుంది. శుక్ర గ్రహానికి సుమారు 225 రోజులు పడుతుంది. భూమి 365.25 రోజులు తీసుకుంటుంది. అంగారకుడు సూర్యుడిని ఒకసారి చుట్టేయడానికి సుమారు 687 రోజులు తీసుకుంటుంది. గురుడు (అతి పెద్ద గ్రహం) సుమారు 11.86 సంవత్సరాల కాలం పడుతుంది. శని సుమారు 29.46 సంవత్సరాలు, యురేనస్ సుమారు 84 సంవత్సరాలు, నెప్ట్యూన్ సుమారు 164.8 సంవత్సరాలు, ప్లూటో సుమారు 248 సంవత్సరాల కాలం తీసుకుంటాయి. పడుతుంది. ఇటీవల ఖగోళ శాస్త్రవేత్త డోర్జే అంగ్ చుక్ భూ భ్రమణాన్ని వీడియోలో బంధించాడు. అయితే, ఇది మిగతా గ్రహాలకు సాధ్యం కాదు. ఆ గ్రహాల భ్రమణాన్ని పలు సాఫ్ట్‌వేర్‌లు రియల్-టైమ్‌లో చూపిస్తాయి. తాజాగా ఇలాంటి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అయితే, ఇందులో అన్ని గ్రహాలు లేవు, కేవలం భూమి, జూపిటర్ గ్రహాల భ్రమణాలను చూపించారు. ఈ రెండు గ్రహాలు సూర్యుడి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యలో తిరుగుతున్నాయి. ఇక ఈ వీడియోలో గురు గ్రహం సూర్యుడి చుట్టూ ఒక రౌండ్ పూర్తి చేసే సరికి భూమి 12 సార్లు చుట్టేస్తుంది. చూసేందుకు రెండు గ్రహాలు డ్యాన్స్ చేస్తున్నాయా? అన్నట్లుగా అందంగా కనిపిస్తుంది. ఈ వీడియోను ఖగోళ ప్రియులు తెగ లైక్ కొడుతూ షేర్ చేస్తున్నారు.

# రోబోలపై ట్యాక్స్.. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ.. ఏఐతో ఉద్యోగాలకు ఎసరు..




ఫీచర్స్ : మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ రోబోలపై టాక్స్ వేయాలని కామెంట్స్ చేశాడు. 2017లో ఈ వ్యాఖ్యలు చేసినా.. ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. పెద్ద డిస్కషన్‌కు దారితీశాయి. కారణం మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో ఏఐ ఎంటర్ కావడమే. ఇప్పటికే చాలా ఇండస్ట్రీలో ఏఐ డామినేషన్ నడుస్తుండగా.. చాలా మంది కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోతున్నారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఈజీగా కోడ్ జనరేట్ చేస్తుండగా.. మనుషుల అవసరం లేకుండా పోతుంది. కష్టపడి సంపాదించిన డిగ్రీలు, పీజీలకు వాల్యూ లేకుండా పోతుంది. ప్రత్యేకంగా నేర్చుకున్న కోర్సులతో యూజ్ లేక రోడ్డు మీద పడాల్సి వస్తుంది. ఈ మధ్య ట్రెండ్ అవుతున్న కాన్వా కోడ్ నిజమైతే ఇక పరిస్థితి అంతే. విద్యార్థులు, ఉద్యోగులు పనిలేక ఇంట్లో కూర్చోవాల్సిందే. మానసికంగా కుమిలిపోవాల్సిందే.

అందుకే బిల్ గేట్స్ చెప్పినట్లుగా ఆటోమేషన్ కార్మిక శక్తిని మార్చేస్తున్నందన.. ఉద్యోగ నష్టాలను తగ్గించేందుకు రోబోలపై పన్ను విధించడం పొటెన్షియల్ పాలసీగా పరిగణించబడుతోంది. ఈ విధానం జాబ్ కోల్పోయిన కార్మికులకు మద్దతు ఇవ్వడానికి ఆదాయాన్ని సమకూర్చగలదు. అయితే ఇది వివాదాస్పదంగా ఉంది. ఎందుకంటే ఆవిష్కరణ, ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతుందనే చర్చలు కొనసాగుతున్నాయి. బిల్ గేట్స్ తన రోబో పన్ను ప్రతిపాదనను నేరుగా యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ తో లింక్ చేయలేదు. అయితే ఈ రెండు ఆలోచనలు తరచూ కలిసి చర్చించబడుతున్నాయి. 2024 నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో "వాట్స్ నెక్స్? ది ఫ్యూచర్ విత్ బిల్ గేట్స్"లో.. పేదరికాన్ని తగ్గించడానికి, దీర్ఘకాలిక ఖర్చులను ఆదా చేయడానికి UBI పవర్ ఎలా ఉంటుందో ఆయన వివరించారు. బాలల పేదరికం నిర్మూలనకే అమెరికాకు సంవత్సరానికి %వి%1 ట్రిలియన్‌కు పైగా ఖర్చు అవుతుందన్నారు.

యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ అంటే..?

యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ అనేది ప్రతి వ్యక్తికి నిర్దిష్ట మొత్తంలో డబ్బును, షరతులు లేకుండా క్రమం తప్పకుండా అందించే ఆర్థిక విధానం. దీని ప్రయోజనాలు వివిధ సామాజిక, ఆర్థిక సందర్భాలలో గమనించవచ్చు.

పేదరికం తగ్గింపు:

UBI ప్రతి వ్యక్తికి కనీస ఆదాయాన్ని అందించడం ద్వారా పేదరికాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. బిల్ గేట్స్ 2024 నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో పేర్కొన్నట్లు.. అమెరికాలో బాలల పేదరికం సంవత్సరానికి %వి%1 ట్రిలియన్‌కు పైగా ఖర్చును కలిగిస్తుంది. UBI ఈ ఆర్థిక భారాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

ఆర్థిక భద్రత:

UBI వ్యక్తులకు ఆర్థిక స్థిరత్వాన్ని అందిస్తుంది. ముఖ్యంగా ఆటోమేషన్ వల్ల ఉద్యోగ నష్టాలు ఎదుర్కొనే వారికి సపోర్టింగ్‌గా ఉంటుంది. కనీస జీవన వ్యయాలను (ఆహారం, గృహం, ఆరోగ్యం) కవర్ చేయడంలో సహాయపడుతుంది, ఆర్థిక ఒత్తిడిని తగ్గిస్తుంది.

సృజనాత్మకతను ప్రోత్సహించడం:

UBI ఆర్థిక భద్రతను అందించడం ద్వారా వ్యక్తులు కొత్త వ్యాపారాలు ప్రారంభించడం, విద్యను కొనసాగించడం లేదా సృజనాత్మక కార్యకలాపాలలో పాల్గొనడం వంటి రిస్క్‌లను తీసుకోవడానికి అనుమతిస్తుంది. ఇది ఆర్థిక వ్యవస్థలో ఆవిష్కరణను పెంచుతుంది.

సామాజిక సమానత్వం:

UBI ఆదాయ అసమానతలను తగ్గిస్తుంది. ఎందుకంటే ఇది ఆర్థిక స్థితి లేదా ఉద్యోగ స్థితితో సంబంధం లేకుండా.. అందరికీ సమానంగా అందించబడుతుంది. ఇది సామాజిక ఐక్యతను ప్రోత్సహిస్తుంది. వివక్షను తగ్గిస్తుంది.

ఆరోగ్యం మెరుగుదల:

ఆర్థిక ఒత్తిడి తగ్గడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. UBI ఆరోగ్య సంరక్షణ, ఇతర అవసరమైన సేవలకు ప్రాప్యతను పెంచుతుంది. ఇది సమాజంలో మొత్తం శ్రేయస్సును మెరుగుపరుస్తుంది.

ఆటోమేషన్‌కు అనుగుణంగా మార్పు:

ఆటోమేషన్, AI వల్ల ఉద్యోగాలు తగ్గుతున్న నేపథ్యంలో.. UBI ఉద్యోగ నష్టాలను ఎదుర్కొనే వారికి ఆర్థిక మద్దతును అందిస్తుంది. బిల్ గేట్స్ రోబోట్ పన్ను ద్వారా సేకరించిన ఆదాయం UBI కార్యక్రమాలకు నిధులు సమకూర్చడానికి ఉపయోగపడవచ్చని సూచించారు.




# వేసవి సెలవుల్లో అనారోగ్యం పాలవ్వకుండా ఈ జాగ్రత్తలు పాటించాల్సిందే!



: ప్రస్తుతం వేసవి కలం కావడంతో స్కూల్స్‌కి సెలవులు రావడం సహజమే. ఈ పరిస్థితులలో పిల్లలు ఇళ్లలోనే గడిపే పరిస్థితి నెలకొంది. ఇంతకాలం ఉదయాన్నే స్కూల్‌కి వెళ్లే సాయంత్రానికి తిరిగి వచ్చే అలవాటులో ఉన్న పిల్లలు ఇప్పుడు ఇంట్లో ఎక్కువ సమయం ఉంటారు.అయితే వేసవి కాలంలో పిల్లలు వేడి, తేమ, ధూళి, కాలుష్యం వంటి సమస్యల మధ్య ఎ ా రి ఆరోగ్యంపై ప్రభావం పడవచ్చు. మరి వాటి కోసం తగిన శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. అందుకోసం కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. మరి అవేంటో ఒక లుక్ వేద్దామా.. వేసవి వేడి తీవ్రంగా ఉండే ఈ సమయంలో పిల్లలకు చిరాకు పెట్టించే పాపులర్ పాలిస్టర్ బట్టలు కాకుండా, తేలికగా ఉండే కాటన్ దుస్తులను వేయించడం మంచిది. ఇవి శరీరానికి తేమను ఇబ్బంది పెట్టకుండా ఉంచి, చర్మం ఇరుకుగా లేకుండా ఉడికిపోవడాన్ని తగ్గిస్తాయి. ఒకవేళ పిల్లలు బయటకు వెళ్లే అవసరం వస్తే దోమలు, ఇతర కీటకాల నుంచి కాపాడేందుకు లోషన్స్ వాడాలి. ఇది చర్మాన్ని రక్షిస్తూ దద్దుర్లు, తామర వంటి సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. ఇంకా వేసవిలో చెమట ఎక్కువగా రావడం వల్ల చర్మ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. వీటిని నివారించేందుకు సహజమైన నేచురల్ రెమిడీస్, సన్‌స్క్రీన్ లోషన్‌లు, మాయిశ్చరైజర్‌లు ఉపయోగించాలి. ఇవి %ఖఎ% కిరణాల ప్రభావాన్ని తగ్గించడంలో ఇవి కీలకంగా పనిచేస్తాయి. సెలవుల్లో పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్ తింటారు. ఇంకా కార్బొనేటెడ్ డ్రింక్స్ తీసుకుంటారు. ఇది గ్యాస్, కడుపునొప్పి, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలకు దారితీస్తుంది. వీటిని నివారించేందుకు శుభ్రమైన, ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని అందించడం ద్వారా భయటపడవచ్చు. పిల్లలు బయట ఆడి ఇంటికి వచ్చిన వెంటనే చేతులు కడుక్కోవడం అలవాటు చేయాలి. లేకపోతే క్రిములు ఇంట్లోకి చేరి అనారోగ్య సమస్యలకు కారణమవుతాయి. ఆటల్లో మునిగిపోయే పిల్లలు ఎక్కువగా నీరు తాగడం మరిచిపోతారు. దీని వల్ల డీహైడ్రేషన్‌కి లోనవుతారు. కాబట్టి వారిని తరచూ నీరు తాగమని చెప్పాలి. అలాగే పండ్ల రసాలు, నారింజ జ్యూస్ వంటి హైడ్రేటింగ్ పానీయాలు ఇవ్వాలి. సెలవుల్లో పిల్లలు స్నాక్స్‌కు అలవాటు పడిపోతారు. దీంతో వారి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. అందుకే తాజా పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్ సలాడ్స్ వంటి ఆరోగ్యకరమైన ఆహారాలను ఇంట్లోనే తయారుచేసి ఇవ్వాలి. వేసవి తాపం తీవ్రమవుతున్న నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో పిల్లలను బయటకు పంపకుండా చూడాలి. అవసరమైతే మాత్రమే, అది కూడా ఉదయం లేదా సాయంత్రం చల్లగా ఉన్న సమయంలోనే బయటకు పంపాలి. సూర్యుని నుండి వచ్చే ప్రమాదకర %ఖఎ% కిరణాలు, గాలిలో కలిసిన కాలుష్య కారణాలు పిల్లలకు అనేక అనారోగ్య సమస్యలకు దారితీయవచ్చు. వీటిని నివారించేందుకు ఇంటిలో శుభ్రత పాటించాలి, అవసరమైతే మాస్కులు వాడించాలి. మొత్తంగా వేసవి సెలవుల్లో పిల్లలు ఆనందంగా గడపడం కంటే ముందు ఆరోగ్యంగా ఉండడం ముఖ్యం. పై సూచనలు పాటిస్తూ వారి ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు సరైన జాగ్రత్తలు తీసుకుంటే, పిల్లలు ఈ సెలవులను ఆరోగ్యంగా, సురక్షితంగా గడిపే అవకాశం

దిశ, ఫీచర్స్ : అడ్రినల్ ఫెటీగ్.. ఈ మధ్య చాలామందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో 'అడ్రినల్ ఫెటీగ్(%ూాంతీవఙఖ్రీ టఫఅస్త్రబవ%)' ఒకటి. ఒకప్పుడు పెద్దల్లోనే కనిపించే ఈ ప్రాబ్లం ఇప్పుడు యువతను కూడా ఇబ్బంది పెడుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.శారీరక బలహీనత, తరచుగా నీరసం, కొంచెం శారీరక శ్రమ చేయగానే తీవ్రమైన అలసటకు గురికావడం ఈ వ్యాధి ప్రత్యేకత. మూత్ర పిండాలపై భాగంలో ఉండే అడ్రినల్ గ్రంథులు సరిగ్గా పనిచేయకపోవడంవల్ల ఈ అడ్రినల్ ఫెటీగ్ లేదా అడ్రినల్ ఎగ్జాస్టన్ అనే ఆరోగ్య సమస్య తలెత్తుతుంది.

లక్షణాలు :-

తీవ్రమైన అలసట, అధికంగా మానసిక ఒత్తిడి , నిద్రలేమి, తీపి, ఉప్పగా ఉండే ఫుడ్స్ ఎక్కువగా తినడం, బద్ధకం ఆవహించడం, మహిళల్లో అయితే ప్రీ మెన్‌స్ట్రువల్ సింఢ్రోమ్, మెనోపాజ్ సమయంలో బ్లడ్ ప్రెషర్ వంటివి కూడా ఈ వ్యాధి లక్షణాలుగా ఉంటాయి. ఇటువంటి సందర్భాల్లో అడ్రినల్ గ్లాండ్స్ శరీర అవసరాలను తీర్చడంలో సరిగ్గా స్పందించవు.

నివారణ :- కొన్ని రకాల ఆహారాలు, మందుల ద్వారా ఈ సమస్య తగ్గుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పోంతోతేనిక్ యాసిడ్‌గా పిలువబడే ఆహారం (విటమిన్ B5) దీనిని నివారిస్తుంది. విటమిన్ B6, విటమిన్ సి లభించే ఆహారాలు కూడా నాడీ వ్యవస్థను ఉత్తేజ పరిచి, ఒత్తిడిని దూరం చేయడంవల్ల అడ్రినల్ ఫెటీగ్‌ను తగ్గిస్తాయి.

## చిన్న పనికే అలసిపోతున్నారా? అడ్రినల్ ఫెటీగ్ కావచ్చు..!





# సినిమా చిత్రం

## మన నాని.. ఫుల్ ట్రెండింగ్ లో ఉన్నాడుగా!



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని.. బ్యాక్ టు బ్యాక్ మూవీస్ తో సందడి చేస్తున్న విషయం తెలిసిందే. ఓ వైపు హీరోగా దూసుకుపోతూనే.. మరో వైపు నిర్మాతగా రాణిస్తున్నారు. రీసెంట్ గా లీడ్ రోల్ లో నటించిన హిట్ ది థర్డ్ కేస్ తో సూపర్ హిట్ అందుకున్నారు. అదే సమయంలో చిన్న మూవీ కోర్ట్ తో మంచి సక్సెస్ ను సాధించారు. రెండు సినిమాలు.. నెల గ్యాప్ లోనే రిలీజ్ అయ్యి ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ అందుకున్నాయి. అనేక మందిని మెప్పించాయి. బాక్సాఫీస్ వద్ద కూడా భారీ వసూళ్లను రాబట్టాయి. సరికొత్త రికార్డులు క్రియేట్ చేశాయి. నానికి అరుదైన ఘనతలు తెచ్చిపెట్టాయి. ఇప్పుడు ఆ రెండు సినిమాలు కూడా ఓటీటీలోకి వచ్చాయి. ప్రముఖ ఓటీటీ నెట్ ఫ్లిక్స్ లోనే రెండు చిత్రాలు హిట్-3, కోర్ట్ ఇప్పుడు స్ట్రీమింగ్ అవ్వడం గమనార్హం. ప్రస్తుతం అక్కడ కూడా దూసుకు పోతున్నాయి. ఓటీటీలో ట్రెండింగ్ లో ఉన్నాయి. టాప్ లిస్ట్ లో స్థానం సంపాదించుకున్నాయి. నెం.1లో క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ హిట్-3 ఉండగా, కోర్ట్ రూమ్ డ్రామా కోర్ట్ 8వ స్థానంలో ట్రెండింగ్‌లో ఉంది. అలా నానికి సంబంధించిన రెండు సినిమాలు.. ఓటీటీలో ఇప్పుడు సందడి చేస్తున్నాయి. అయితే శైలేష్ కొలను దర్శకత్వం వహించిన హిట్-3లో అర్జున్ సర్కార్ రోల్ పోషించారు నాని. నెవ్వర్ బిఫోర్ అనేలా కనిపించి మెప్పించారు. ఇప్పటివరకు కెరీర్ లో అంత వైలెన్స్ తో ఉన్న పాత్రలో నాని కనిపించడం ఇదే మొదటిసారి. మరోవైపు, కోర్ట్ మూవీలో ప్రముఖ నటుడు ప్రియదర్శి, హర్ష్ రోషన్, శ్రీదేవి కీలక పాత్రల్లో నటించారు. రామ్ జగదీశ్ దర్శకత్వం వహించగా, తక్కువ బడ్జెట్ తోనే స్పెషల్ గా నాని నిర్మించారు. చిన్న సినిమాల్లో అత్యంత లాభాలు తీసుకొచ్చిన మూవీగా రికార్డు క్రియేట్ చేసింది. ప్రొడక్షన్ వాల్యూస్ పరంగా నానికి ప్రశంసలు వచ్చాయి. కాగా, నాని త్వరలో శ్రీకాంత్ ఓదెలతో వర్క్ చేయనున్నారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పారడైజ్ ను ప్రారంభించబోతున్నారు. మరికొద్ది రోజుల్లో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుంది. ఆ తర్వాత నటించాల్సిన సినిమాలు ఇప్పటికే లైన్ లో పెట్టేశారు. అటు చిరు- ఓదెల మూవీ సహా పలు ప్రాజెక్టులను నిర్మించనున్నారు. మరి ఫ్యూచర్ లో నాని ఎలాంటి సక్సెస్ లు అందుకుంటారో వేచి చూడాలి.

## మొన్న అలియా భట్.. ఇప్పుడు త్రిష..



నాలుగు పదుల వయసులో కూడా త్రిష చేతినిండా సినిమాలతో కెరీర్లో దూసుకెళ్తుంది. రీసెంట్ గా గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీతో సూపర్ హిట్ ను తన అకౌంట్ లో వేసుకున్న త్రిష సుమారు రెండు దశాబ్దాలుగా సినీ రంగంలో సత్తా చాటుతుంది. మధ్యలో కెరీర్ కు బ్రేక్ వచ్చినప్పటికీ పొన్నియన్ సెల్వన్ తర్వాత అమ్మడి క్రేజ్ పెరిగింది. దీంతో సెకండ్ ఇన్నింగ్స్ లో కూడా త్రిషకు మంచి ఆఫర్లు దక్కుతున్నాయి. తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో అనేక సినిమాల్లో నటించిన త్రిష చేతిలో ప్రస్తుతం థగ్ లైఫ్, విశ్వంభర సినిమాలున్నాయి. కమల్ హాసన్ సరసన మణిరత్నం దర్శకత్వంలో త్రిష నటించిన థగ్ లైఫ్ సినిమా రిలీజ్ కు రెడీ అయింది. జూన్ 5న థగ్ లైఫ్ ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా పలు ఈవెంట్స్ లో పాల్గొంటున్న త్రిష కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకుంటుంది. మలయాళీ నటుడు ఫహాద్ ఫాజిల్ అంటే తనకు ఇష్టమని, ఆయనతో కలిసి నటించడం తనకు చాలా ఇష్టమని చెప్పుకొచ్చింది. మీరు ఎవరితో నటించాలనుకుంటున్నారని రీసెంట్ గా ఓ సందర్భంలో త్రిషను అడగ్గా అమ్మడు ఫహాద్ ఫాజిల్ పేరు చెప్పింది. ఫహాద్ ఫాజిల్ తో నటించాలనుంది. అతనెలాంటి కథనైనా, ఎలాంటి క్యారెక్టర్‌లో అయినా అద్భుతంగా నటించగలడు. అతను చాలా అద్భుతమైన నటుడు అని మనసులోని మాటను బయటపెట్టింది త్రిష. త్రిష చెప్పినట్టు ఫహాద్ చాలా గొప్ప నటుడు. ఎలాంటి పాత్రనైనా, ఎలాంటి సినిమానైనా చేయగల కెపాసిటీ ఉన్న యాక్టర్. మొన్నటికి మొన్న అలియా భట్ కూడా ఫహాద్ అంటే ఇష్టమని, కచ్చితంగా అవకాశం వస్తే అతనితో కలిసి నటించడానికి రెడీగా ఉన్నానని చెప్పింది. ఇప్పుడు త్రిష కూడా ఫహాద్ అంటే ఇష్టమని, తనతో కలిసి నటించాలనుందని తెలిపింది. ఇక థగ్ లైఫ్ విషయానికొస్తే ఈ సినిమా నాయగన్ ను మించి ఉంటుందని చిత్ర యూనిట్ మొత్తం ఎంతో గొప్పగా చెప్తుంది. దీంతో పాటూ త్రిష, చిరంజీవితో చేస్తున్న విశ్వంభర సినిమాపై కూడా అందరిక మంచి అంచనాలున్నాయి.

## 'హరి హర వీరమల్లు' పవన్ సినిమానేనా...?




పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన నుంచి రాబోతున్న మొదటి సినిమా 'హరి హర వీరమల్లు'. నాలుగు.. ఐదు ఏళ్ల క్రితం ప్రారంభం అయిన ఈ సినిమా కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. సినిమా చాలా ఆలస్యం కావడంతో దర్శకుడు క్రిష్ సినిమా నుంచి తప్పుకున్నాడు. దాంతో సినిమా దర్శకత్వ బాధ్యతలను ఏఎం రత్నం తనయుడు జ్యోతికృష్ణ తీసుకున్నాడు. క్రిష్ స్థాయిలో కాకున్నా ఆయన కూడా సినిమాను బాగానే రూపొందించి ఉంటాడు అని పవన్ కళ్యాణ్ అభిమానులు నమ్మకంగా ఉన్నారు. జ్యోతికృష్ణ సినిమా షూటింగ్‌ను కిందా మీదా పడి పూర్తి చేశారు, ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ వర్క్ పనిలో ఉన్నారు. సినిమా షూటింగ్‌ను ఎంత జాగ్రత్తగా చేస్తారో, అంతకు మించి సినిమాను ప్రమోట్ చేసే విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఈ మధ్య కాలంలో పెద్ద హీరోల సినిమాల యొక్క ప్రమోషన్ కార్యక్రమాలు ఏ రేంజ్‌లో జరుగుతున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. ఈ ఏడాది ఆరంభంలో వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంలో ప్రమోషన్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషించాయి. అందుకే చిరంజీవితో అనిల్ రావిపూడి చేస్తున్న సినిమాకు ఇప్పటి నుంచే ప్రమోషన్ కార్యక్రమాలు మొదలు పెట్టారు.

కానీ మరో పది రోజుల్లో విడుదల కాబోతున్న హరి హర వీరమల్లు సినిమాకు ఇంకా పబ్లిసిటీ కార్యక్రమాలు షురూ కాలేదు. హరిహర వీరమల్లు సినిమాకి మంచి బజ్ క్రియేట్ అయింది. అయితే సినిమాను జనాల్లోకి మరింతగా తీసుకు వెళ్లడం కోసం మేకర్స్ ప్రమోట్ చేయాల్సిన అవసరం ఉంది. పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు సినిమా షూటింగ్ మొదలు పెట్టి చాలా కాలం అయింది. కానీ ఆలస్యం కావడంతో సినిమాపై జనాల్లో నమ్మకం తగ్గుతూ వచ్చింది. ఫ్యాన్స్ మాత్రం ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పవన్ కళ్యాణ్ సినిమా అంటే విడుదలకు నెల రోజుల నుంచే హడావుడి ఉంటుంది. వీఎఫ్ఎక్స్ వర్క్ ముగింపు దశకు చేరుకున్న ఈ సినిమా ట్రైలర్ ఇంకా విడుదల చేయలేదు.

పెద్ద హీరోల సినిమాల ట్రైలర్‌లను విడుదలకు కనీసం మూడు నాలుగు వారాల ముందే విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు వీరమల్లు సినిమా ట్రైలర్‌ను విడుదల చేయలేదు. ట్రైలర్ విడుదలకు ఇంకాస్త సమయం పడుతుందని తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ సినిమా అంటే ఓ రేంజ్‌లో ప్రమోషన్ చేయాల్సిన అవసరం ఉంది. కానీ మేకర్స్ మాత్రం ఇంకా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లోనే ఉన్నారు. గత వారం చెన్నైలో పాట విడుదలకు సంబంధించిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కానీ అది పెద్దగా సినిమాపై హైప్ క్రియేట్ చేయలేక పోయింది.

సినిమా నుంచి వచ్చిన పాటలు ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. దాంతో సినిమాకు దక్కాల్సిన బజ్ దక్కలేదు. ఈ సినిమా చుట్టూ అలుముకున్న సైలెన్స్‌ను చూస్తూ ఉంటే అసలు ఇది పవన్ కళ్యాణ్ సినిమానేనా అనే అనుమానం కలుగుతుంది అంటూ స్వయంగా అభిమానులే కామెంట్ చేస్తున్నారు. ఇప్పటికి అయినా ప్రమోషన్ స్పీడ్ పెంచకుంటే కచ్చితంగా పెద్ద దెబ్బ పడే అవకాశాలు ఉన్నాయి. నిర్మాత టికెట్ల రేట్లు పెంపు, భారీ బిజినెస్ పై దృష్టి పెట్టకుండా ప్రమోషన్ పై కూడా దృష్టి పెడితే బాగుంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## రాజాసాబ్ : మళ్లీ లీక్.. మరోసారి వైరల్



ప్రభాస్ సలార్, కల్కి 2898 ఏడీ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకున్న నేపథ్యంలో ఆయన నుంచి రాబోతున్న రాజాసాబ్ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా పెరిగాయి. సినిమాను 2025 సమ్మర్‌లోనే విడుదల చేయాలని భావించారు. ఏప్రిల్ నెలలోనే సినిమాను విడుదల చేయాలని భావించినా కూడా సాధ్యం కాలేదు. షూటింగ్ ఆలస్యం కావడంతో పాటు, వీఎఫ్ఎక్స్ వర్క్ ఆలస్యం కావడం వల్ల విడుదల వాయిదా వేశారు. బ్యాలన్స్ షూటింగ్‌ను త్వరలోనే పూర్తి చేసి, ఈ ఏడాది చివరి వరకు ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని భావిస్తున్నారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. ఈ సినిమా నుంచి గతంలోనే ఒక ఫోటో లీక్ అయింది. తాజాగా మరో ఫోటో లీక్ అయింది. ఆ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ప్రభాస్ మాస్ లుక్‌లో ఉన్న ఆ ఫోటోకు మంచి స్పందన వచ్చింది. ఆ ఫోటో క్వాలిటీ లేకున్నా సోషల్ మీడియాలో అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. అంతే కాకుండా ఫ్యాన్ గ్రూప్స్ లో పంచుకుంటూ, ఫోటో గురించి చర్చించుకుంటున్నారు. రఫ్ లుక్‌లో ప్రభాస్ ను చూస్తూ ఉంటే భలే ఉంది అంటూ కొందరు కామెంట్ చేస్తూ ఉన్నారు. ప్రభాస్‌ను ఇలా చూసి చాలా కాలం అయింది అంటూ అభిమానులు సైతం చర్చించుకుంటున్నారు. మిర్చి తరహా లుక్‌లో ప్రభాస్‌ను చూడటం చాలా సంతోషంగా ఉందని వారు అంటున్నారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఆ మధ్య ఈ సినిమా ఆర్థిక పరమైన ఇబ్బందుల కారణంగా ఆలస్యం అవుతూ వస్తోందనే పుకార్లు షికార్లు చేశాయి. కానీ ఈ సినిమాకు ఎలాంటి ఆర్థిక ఇబ్బంది లేదు అంటూ మేకర్స్ చెప్పుకొచ్చారు. సినిమా షూటింగ్ త్వరలోనే పూర్తి చేసి, అతి త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను సైతం పూర్తి చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. దసరా లేదా ఆ తర్వాత అయినా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. రాజాసాబ్ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే విశ్వాసంను ప్రభాస్ ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో హర్రర్ థ్రిల్లర్ సినిమాలకు మంచి రెస్పాన్స్ దక్కుతుంది. హిందీ ఇండస్ట్రీలో కూడా థ్రిల్లర్ సినిమాలకు భారీ వసూళ్లు నమోదు అవుతున్న ఈ సమయంలో రాజాసాబ్ అదే జోనర్ కావడంతో అక్కడ, ఇక్కడ అనే తేడా లేకుండా అన్ని చోట్ల మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాలో ప్రభాస్ హీరోగా నటిస్తూ ఉండగా నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంజయ్ దత్ ఈ సినిమాలో ప్రభాస్ తాత పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి త్వరలోనే టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో విడుదల తేదీ విషయమై క్లారిటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

## భైరవం రిలీజ్.. ఖలేజా రీ రిలీజ్.. మనోజ్ ఏమన్నారంటే?

ఇప్పుడు 8 ఏళ్ల తర్వాత భైరవం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన ఆ సినిమాలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్ తో పాటు మనోజ్ నటించారు. మే 30వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ అయింది మూవీ. అదే రోజు సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన ఖలేజా మూవీ రీ రిలీజ్ అయింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించిన ఆ సినిమా.. అప్పట్లో బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా మారింది. ఆ తర్వాత కల్ట్ స్టేటస్ పొందింది. ఇప్పుడు రీ రిలీజ్ లో సూపర్ రెస్పాన్స్ అందుకుంది. వరల్డ్ వైడ్ గా భారీ వసూళ్లను రాబట్టి.. కొత్త రికార్డులను క్రియేట్ చేసింది. మహేష్ బాబు ఫ్యాన్స్.. థియేటర్స్ లో పండగలా సెలబ్రేట్ చేసుకుంటున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అలా ఖలేజా రీ రిలీజ్ లో మాసివ్ రెస్పాన్స్ అందుకోగా.. ఆ ఎఫెక్ట్ భైరవంపై పడిందని టాక్ వచ్చింది. బాక్సాఫీస్ కలెక్షన్ల విషయంలో తేడాలు కనిపించాయని ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపించాయి. ఇప్పుడు ఆ విషయంపై మంచు మనోజ్ స్పందించారు. రీ రిలీజ్ సినిమాలు వీకెండ్స్ లో కాకుండా వీక్ డేస్ లో విడుదల చేస్తే బాగుంటుందని మనోజ్ అభిప్రాయపడ్డారు. అలా చేస్తే కొత్త సినిమాకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. వీకెండ్స్ లో విడుదల చేస్తే మనమే ఓ మూవీని మరో మూవీతో చంపేసినట్లు ఉంటుందన్నారు.

అదే సమయంలో ఎలాగైనా ఏ సినిమాకు ఉండాల్సిన బలం.. ఆ సినిమాలకు ఉంటుందని చెప్పారు. ఎందుకంటే వీకెండ్స్ లోనే అందరికీ ఫ్రీ టైమ్ దొరుకుతుందని తెలిపారు.

అందుకే రీ రిలీజ్ విషయంపై సినీ పెద్దలు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు.

రీ రిలీజ్ ల విషయంలో కాస్త పునరాలోచించాలని ఆయన కోరారు. ఇక మనోజ్ సినిమాల విషయానికొస్తే.. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అలరించేందుకు ఆయన ఇప్పుడు సిద్ధమవుతున్నారు. భైరవంతో మంచి ప్రశంసలు అందుకున్నారు. తేజ సజ్జా మిరాయ్ లో నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్ లో నటిస్తున్నారు. దాంతోపాటు రక్షక్, వాట్ ది ఫిష్ వంటి వివిధ ప్రాజెక్టుల్లో యాక్ట్ చేస్తూ బిజీగా గడుపుతున్నారు.



## అక్కినేని హీరో మూవీలో 'లైగర్' ఐటెం..!

అఖిల్ చివరగా 'ఏజెంట్' సినిమాతో 2023లో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశ పరిచిన విషయం తెల్సిందే. ఏజెంట్ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలవడంతో అఖిల్ తదుపరి సినిమా విషయంలో చాలా టైమ్ తీసుకున్నాడు. అక్కినేని ఫ్యాన్స్ అఖిల్ సినిమాల విషయంలో నిరుత్సాహంగా ఉన్నారు. కెరీర్ ఆరంభం నుంచి అఖిల్ ప్రతి సినిమాకు కష్టపడు తున్నాడు కానీ ఫలితం మాత్రం దక్కడం లేదు. అందుకే అఖిల్ ఈసారి కాస్త ఎక్కువ సమ యం తీసుకుని, మంచి కాన్సెప్ట్ ఓరియంటెడ్ స్క్రిప్ట్‌ను పట్టుకున్నట్లు తెలుస్తోంది. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో అఖిల్ ప్రస్తుతం 'లెనిన్' సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను రాయల సీమ బ్యాక్‌డ్రాప్‌లో రూపొంది స్తున్నారు. సినిమాను నవంబర్ 14న విడుదల చేసేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల విడుదల అయిన లెనిన్ టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. అఖిల్ లుక్‌తో పాటు, శ్రీలీల లుక్, ఇతర బ్యాక్‌డ్రాప్ అన్ని కలిపి లెనిన్ సినిమాకు పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. సినిమాకు హైప్ పెంచే విధంగా, సిని మాను మరింత మందికి చేరువ అయ్యే విధంగా చేసేం దుకు గాను మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకమైన ఐటెం సాంగ్‌ను ప్లాన్ చేశారని తెలుస్తోంది. బాలీవుడ్ ముద్దుగుమ్మను ఈ సినిమా కోసం రంగంలోకి దించే ప్రయత్నాలు చేస్తున్నారు. అఖిల్ అక్కినేనితో 'లెనిన్' సినిమాలో బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే స్పెషల్ సాంగ్‌లో స్టెప్స్ వేయ బోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. చిత్ర యూనిట్ సభ్యులు కొన్ని రోజుల క్రితం అనన్య పాండేనే ఈ సినిమా కోసం సంప్రదించారనే వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం లెనిన్ సినిమాలో అనన్య పాండే ఐటెం సాంగ్‌ను చేసేందుకు గాను ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. లైగర్ సినిమా తర్వాత టాలీవుడ్‌లో అనన్య కనిపించబోతున్న సినిమా ఇదే కావడం విశేషం. లైగర్ సినిమాలో ఇష్టం లేకుండా నటించాను అంటూ చెప్పిన అనన్య పాండే లెనిన్ సినిమాలో ఐటెం సాంగ్‌కి మాత్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఒకింత ఆశ్చర్యంను కలిగించే విషయం. లెనిన్ సినిమా కోసం అఖిల్ అక్కినేని చిత్తూరు యాసలో మాట్లాడబోతున్నాడు. పుష్ప తర్వాత లెనిన్ సిని మాను రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిం చబో తు న్నారు. అఖిల్ లుక్‌కి పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. ఇక అఖిల్‌కి జోడీగా శ్రీలీల నటించడం కూడా ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ సిని మాపై అక్కినేని ఫ్యాన్స్ మాత్రమే కాకుండా అక్కినేని ఫ్యా మిలీ మొత్తం చాలా ఆశలు పెట్టుకున్నట్లుగా తెలు స్తోంది. మరి అందరి అంచనాలను లెనిన్ సినిమా అందు కుంటుందా అనేది చూడాలి. అఖిల్ పెళ్లి తర్వాత లెనిన్ సిని మాతో ప్రేక్షకుల ముందుకు మొదటి సారి రాబోతు న్నాడు. కనుక ఎలాంటి ఫలితం దక్కుతుంది అనేది చూడాలి.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail: prabhathasuryudunewsdesk@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555